


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## 31న పెనుగొండకు సీఎం చంద్రబాబు

- వాసవీ కన్యకాపరమేశ్వరికి పట్టువస్త్రాలు
- ఆత్మార్పణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి
- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్

6

# నిధులు..
# ప్రాజెక్టులే లక్ష్యం


- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యమిచ్చేలా కృషి చేయండి
- కొత్త రోడ్లు కేటాయింపు, విస్తరణకు అనుమతులు సాధించండి
- రాష్ట్ర పరిస్థితిని సమర్థంగా కేంద్రానికి వివరించాలి..
- విభజన చట్టంలోని పెండింగ్ అంశాలను ప్రస్తావించండి
- టీడీపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

2



## జూన్‌లోగా పదవుల భర్తీ

నామినేటెడ్ పోస్టులపై సీఎం చంద్రబాబు వెల్లడి



- పార్టీకోసం పనిచేసిన వాళ్లకే తొలి ప్రాధాన్యమని హామీ
- 'క్యూబ్స్' సభ్యులకే పదవులంటూ స్పష్టీకరణ
- ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా దిశానిర్దేశం
- ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం టెలికాన్ఫరెన్స్

3

## ఒక్క మాటా మాట్లాడొద్దు!

- వైసీపీ తెరవెనుక డ్రామాలపై 'సుప్రీం' సీరియస్
- చంద్రబాబుపై కేసులు సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్ డిస్మిస్
- ఇలాంటి పిటిషన్లూ వాదిస్తారా.. అంటూ సీనియర్ న్యాయవాదికి చీవాట్లు
- పిచ్చి పిటిషన్‌తో పరువు పోగొట్టుకున్న హైకోర్టు న్యాయవాది

3

## కుప్పంలో 1ఎం1బి

### సాంకేతిక వర్క్‌ఫోర్స్ నిర్మాణానికేనన్న సీఎం

అమరావతి (చైతన్య రథం): భవిష్యత్ కోసం సాంకేతిక వర్క్‌ఫోర్స్‌ను సిద్ధం చేయడానికి 1ఎం1బి ఆర్గనైజేషన్ ముందుకు వచ్చిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ 'రాయలసీమలోని ప్రతిభావంతులైన యువకుల కోసం 1ఎం1బి ఆర్గనైజేషన్ ప్రత్యేక చొరవ చూపడం ఆనందదాయకం. భవిష్యత్ సాంకేతికత వర్క్‌ఫోర్స్‌ను నిర్మించేందుకు కుప్పంలో తన మొదటి గ్రీన్ స్కిల్స్ అకాడమీ-కెరీర్ రెడీనెస్ సెంటర్‌ను ప్రారంభించింది. రాబోయే కొద్ది సంవత్సరాల్లో 50వేలమంది ఐద్యోగార్థులకు 1ఎం1బి శిక్షణ ఇవ్వనుంది. 30వేలమంది యువకులకు వర్క్‌ప్లేస్ అనుభవాన్ని అందించి.. ఇంటర్న్‌షిప్‌లు మరియు ఉద్యోగాలను అందించనుంది. 100మంది గ్రీన్ ఎనర్జీ వ్యవస్థాపకులను సృష్టించనుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

### జీవో 117 ఉపసంహరణపై
## అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం

- త్వరలోనే ప్రతి శనివారం నో బ్యాగ్ డే
- ఉపాధ్యాయ బదిలీ చట్టంపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ
- ఉపాధ్యాయులకు ఇకపై ఒకటే యాప్
- ప్రజాభిప్రాయసేకరణ కోసం త్వరలోనే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూ ప్రింట్
- అధికారులతో సమీక్షలో మంత్రి నారా లోకేష్



- వివరాలు 4లో..

### గుంటూరు మార్కెట్ యార్డు అధికారులకు
## సీఎం అభినందనలు

అమరావతి (చైతన్య రథం): గుంటూరు మార్కెట్ యార్డు అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. 'పంటను అమ్ముకునేందుకు వచ్చిన రైతన్నలకు ఆహారం అందించడం గొప్ప విషయం. పంటను అమ్ముకోడానికి గుంటూరు మిర్చి యార్డుకు వచ్చిన రైతులకు ఉచితంగా అల్పాహారాన్ని, మధ్యాహ్న భోజనాన్ని అందించడం ప్రశంసనీయం. రెండు రూపాయల నామమాత్ర రుసుముతో వారికి సెంట్రలైజడ్ ఏసీ సదుపాయంతో విశ్రాంతి తీసుకునే అవకాశాన్ని కూడా కల్పించిన అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను' అని పేర్కొన్నారు.

## సమస్యలు తీర్చి ఆదుకోండి

మంత్రి నారా లోకేష్‌కు జనం విన్నపాలు

వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తిచేయండి

భూమిపై హక్కులు కల్పించి న్యాయం చేయాలి

58వ రోజు ప్రజాదర్బార్‌కు అర్జీదారుల బారులు

అందరికీ అండగా ఉంటామని మంత్రి లోకేష్ భరోసా

5



## ప్రాణహాని ఉంది..రక్షణ కల్పించండి



- కుటుంబంలో ముగ్గురిని హతమార్చారు
- ఆడవాళ్లపై అమానుషంగా ప్రవర్తించారు
- ప్రజావినతుల్లో బాధితురాలి కన్నీటి పర్యంతం
- అర్జీలు స్వీకరించిన మంత్రి సవిత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి

7



### జగన్‌రెడ్డి ఆర్థిక విధ్వంసానికి
## నీతి ఆయోగ్ నివేదిక చెంపపెట్టు

- నిజాలు బట్టబయలు
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశాడు
- ఆర్థిక సూచీలో 17వ స్థానానికి దిగజార్చాడు
- ఆయన పాలనలో జరిగిన అవినీతి ఓ రికార్డ్
- ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు ధ్వజం

- వివరాలు 6లో..

# నిధులు.. ప్రాజెక్టులే లక్ష్యం

## టీడీపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యమిచ్చేలా కృషి చేయండి
- కొత్త రోడ్లు కేటాయింపు, విస్తరణకు అనుమతులు సాధించండి
- రాష్ట్ర పరిస్థితిని సమర్థంగా కేంద్రానికి వివరించాలి..
- విభజన చట్టంలోని పెండింగ్ అంశాలను ప్రస్తావించండి



అమరావతి (చైతన్య రథం): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యమిచ్చేలా, రాష్ట్రంలోని ప్రాజెక్టులకు అవసరమైనన్ని నిధులు కేటాయించేలా చూడాలని టీడీపీ ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మంగళవారం ఉండవల్లి నివాసంలో చంద్రబాబు తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్రానికి వివరించి రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు తీసుకురావాలని ఎంపీలకు సీఎం చంద్రబాబు సూచించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్ కోసం రూ.11,440 కోట్లు, నక్కపల్లిలో బల్క్ డ్రగ్స్ ప్రాజెక్టు కోసం రూ.14,000 కోట్లు, అమరావతి నిర్మాణానికి రూ.15,000 కోట్లు, కొప్పర్తి, ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ కారిడార్లకు రూ.4,936 కోట్లు కేటాయించేందుకు ముందుకొచ్చిందని తెలిపారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూడాలని ఎంపీలకు సూచించారు. దేశంలో ఏ రాష్ట్రానికి లేని సముద్రతీరం మన రాష్ట్రానికే ఉందని, పోర్టుల నిర్మాణం ద్వారా దాన్ని సద్వినియోగం చేసుకుంటే పెద్దఎత్తున ఉపాధి లభించటంతోపాటు సంపద సృష్టి జరుగుతుందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కొత్త రహదారులు రాష్ట్రానికి కేటాయించేలా, రహదారుల విస్తరణకు అనుమతులు వచ్చేలా ఎంపీలు పనిచేయాలని, విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చేలా చూడాలని ఎంపీలకు సూచించారు.

### నూతన పాలసీలపై అవగాహన పెంచుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీలపై, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, విదేశాల్లో అమలవుతున్న ప్రాజెక్టులు, పాలసీలపై ఎంపీలు అవగాహన పెంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రానికి ఏవిధంగా ఉపయోగపడతాయో అధ్యయనం చేసి రాష్ట్రంలోని సంబంధిత మంత్రులకు తెలియజేయాలన్నారు. గోదావరి –బనకచర్ల ప్రాజెక్టు గేమ్ ఛేంజర్‌లా పనిచేస్తుందని, అది పూర్తయితే రాష్ట్ర రైతాంగానికి పెద్దఎత్తున ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. సముద్రంలో వృధాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రంలో కరవు నివారణ చేయవచ్చన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.12 వేల కోట్లు ఇచ్చిందని.. ప్రాజెక్టు శరవేగంగా పూర్తిచేసి దాని ఫలాలు రైతులకు అందించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

### నూతన ప్రాజెక్టుల సాధనకు కృషి చేయండి

రైల్వే ప్రాజెక్టులపై ఎంపీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని, పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుతోపాటు నూతన ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సీఎం సూచించారు. నడికుడి– శ్రీకాళహస్తి రైల్వే లైన్, రేణిగుంట– గూడూరు, కోటిపల్లి– నర్సాపూర్, కడప–బెంగళూరు తదితర ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేలా బడ్జెట్‌లో అవసరమైనన్ని నిధులు కేటాయించేలా చూడాలని ఎంపీలకు చంద్రబాబు సూచించారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో సమన్వయం చేసుకొని విజన్ డాక్యుమెంట్లు సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యేలతో, నియోజకవర్గనేతలతో సమన్వయం చేసుకోవాలని, కలిసికట్టుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఉపాధిహామీ వంటి పథకాలకు అనుమతులిచ్చే సమయంలో తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి కేటాయించాలని ఎంపీలకు చంద్రబాబు సూచించారు. సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేసేటప్పుడు జీఎస్టీ లేకుండా చూడాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రస్తావించగా సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు 2024 జాయింట్ పార్లమెంట్ కమిటీకి వెళ్లడానికి టీడీపీ ఎంపీల కృషే కారణమని, బిల్లుకు 14 సవరణలు ఆమోదించగా ఇందులో 4 టీడీపీ ప్రతిపాదించినవేనని టీడీపీ పార్లమెంటరీ నేత కృష్ణదేవరాయలు చెప్పారు. పార్లమెంట్ సమావేశాలకు ఎంపీల హాజరు దేశవ్యాప్తంగా ఉన్న సగటు కంటే ఏపీ టీడీపీ ఎంపీల హాజరు అధికంగా ఉందని, అదేవిధంగా సభ్యు లు ప్రశ్నలు అడగటంలో జాతీయ సగటు 9శాతం ఉంటే..ఏపీది 20శాతం ఉందని, అందులో టీడీపీ సభ్యులది 23 శాతం అధికంగా ఉందని సీఎం అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల్లో, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పార్లమెంటులో లేవెనెత్తి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం సూచిం చారు. సమావేశంలో ఎంపీలతో పాటు మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.

---

ఎంజేపీ గురుకుల పాఠశాలల్లో..

# టెన్త్‌లో వంద శాతం ఫలితాలు సాధించాలి

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



అమరావతి (చైతన్యరథం): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఏంజేపీ గురుకుల పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్ సవిత స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను ఎంజేపీ గురుకుల పాఠశాల ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల సన్నద్ధతతో పాటు అన్ని సబ్జెక్టుల్లోనూ పాఠాలు రివిజన్ ప్రారంభమైందా అనే వివరాలు తెలుసుకున్నారు. టెన్త్ విద్యార్థులకు రాబోయే నెల రోజుల సమయం ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై అధ్యాపకులకు ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చి ఉంటారని, సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పరీక్షల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేయొద్దన్నారు. టెన్త్‌లో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎంజేపీ స్కూళ్లు, హాస్టళ్ల విద్యార్థుల పట్ల సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. గత ప్రభుత్వం పెట్టిన అన్ని రకాల బకాయిలు చెల్లించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఉద్యోగులతో సైతం ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ఆశయ సాధనలో భాగంగా రాబోయే టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఎంజేపీ ఉద్యోగులకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. అంతకు ముందు మంత్రి సవితను ఎంజేపీ ఉద్యోగ సంఘ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ గురుకుల పాఠశాల ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

---

ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

## 23న యూపీఎస్సీ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

హైదరాబాద్(చైతన్యరథం): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలో మొట్టమొదటిసారిగా రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పూర్తిస్థాయి పర్య వేక్షణలో నడపబడుతున్న ఎక్సెల్ సివిల్స్ అకాడమీలో ప్రవేశానికి ఫిబ్రవరి 23న ఉద యం 10:30కు యూపీఎస్సీ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ జరగనుంది. ఈ టెస్ట్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 75 శాతం వరకు మెరిట్ స్కాలర్‌షిప్ ఇవ్వనున్నారు. అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఎక్సెల్ సివిల్స్ అకాడమీ డైరెక్టర్ రాజేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలి పారు. మరిన్ని వివరాలకు 9100433442, 9100433445 నెంబర్లలో లేదా www.excelacademy.comను సందర్శించవచ్చని సూచించారు.

---


దివ్యాంగుల కోసం విశాఖలో

# రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో స్టేడియం

**- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి వెల్లడి**



అమరావతి (చైతన్యరథం): దివ్యాంగుల కోసం విశాఖపట్నంలో రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో స్టేడియం నిర్మిస్తున్నట్టు రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల శాఖ మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పలువురు విభిన్న ప్రతిభావంతులు మంగళవారం వెలగపూడి సచివాయంలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కలిసి 7 వ రాష్ట్ర పారా అథ్లెటిక్ చాంపియన్ షిప్ –2025 పోటీలకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్ టాప్‌లు, ఫోన్‌లు, త్రీ వీలర్స్ ఇస్తున్నామని చెప్పారు. దివ్యాంగుల పింఛను రూ. 6 వేలకు పెంచాం. మంచానికే పరిమితమైన వారికి నెలకు రూ. 15,000 ఇస్తున్నాం. దివ్యాంగ విద్యార్థులకు పింఛన్ ప్రతినెల వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి డోలా తెలిపారు.



# జూన్‌లోగా పదవుల భర్తీ

## నామినేటెడ్ పోస్టులపై సీఎం చంద్రబాబు వెల్లడి

- పార్టీకోసం పనిచేసిన వాళ్లకే తొలి ప్రాధాన్యమని హామీ
- 'క్యూబ్స్' సభ్యులకే పదవులంటూ స్పష్టీకరణ
- ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా దిశానిర్దేశం
- ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి (చైతన్య రథం): జూన్‌లోపు ప్రభుత్వంలోని అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇతర పార్టీలనుంచి వచ్చి చేరిన వారికంటే.. ఎప్పటి నుంచో పార్టీలో ఉండి పనిచేసిన వారిని నేతలు ప్రోత్సహించాలన్నారు. మొదటినుంచీ పార్టీని నమ్ముకున్న వారికే పదవులు దక్కేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని తేల్చి చెప్పారు. 214 మార్కెట్ కమిటీలు, 1100 ట్రస్ట్ బోర్డులున్నాయని, వచ్చే జూన్‌లోగా ఈ నియామకాలు పూర్తి చేస్తామన్నారు. పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, పార్టీ ఇన్‌ఛార్జిలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పదవి పొందిన వాళ్ల రెండేళ్ల పనితీరుపై సమీక్ష చేస్తామన్నారు. దాని ఆధారంగా మళ్లీ నిర్ణయాలు, భవిష్యత్ అవకాశాలు ఉంటాయని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు సరైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు.


వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల్లో పదవి ఆశిస్తున్న వాళ్లు క్యూబ్స్ (క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్) విభాగాల్లో సభ్యులుగా ఉండాలన్నారు. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామని వెల్లడించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు, నేతల పనితీరువంటి అంశాలపై ఇందులో చర్చించారు.

2029లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలని తేల్చి చెప్పారు. ఏడు నెలల కాలంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టామన్న చంద్రబాబు ఈ విషయాలను నిరంతరం ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని, ఈ విషయంలో వైకాపా తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలని నేతలకు సూచించారు. మెంబర్‌షిప్ బాగా చేసిన వారికి పదవుల్లో ప్రోత్సహిస్తామన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. చరిత్రలో తిరుగులేని విజయాన్ని అందించిన ప్రజలు, కార్యకర్తల ఆశలు తీర్చేందుకు, ఆకాంక్షల మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని... ఈ విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలని సూచించారు. గత ఐదేళ్లు కార్యకర్తలు తిరుగులేని పోరాటం చేశారని, వారి కష్టం ఫలితమే మొన్నటి ఎన్నికల విజయమని అభివర్ణించారు. కార్యకర్తలను ఎప్పుడూ గౌరవించుకోవాలని, ఎన్నికలు అయిపోయాయి నేను ఎమ్మెల్యే, ఎంపి అయిపోయాను అని ఎవరూ భావించవద్దని నేతలకు సూచించారు. మంత్రులు జిల్లాల్లో ఎమ్మెల్యేలతో కూర్చుని పార్టీ అంశాలపై చర్చించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. నరేగా పెండింగ్ బిల్లులు చెల్లించేలా ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు పని చేయాలని, ప్రజల్లో సంతృప్తి కలిగేలా... భవిష్యత్‌పై నమ్మకం, భరోసా కలిగేలా పని చేయడమే కూటమి ప్రభుత్వ విధానంగా వివరించారు. ఇప్పుడు ప్రజలకు ఏంచేస్తాం... భవిష్యత్‌లో ఏంఇస్తాం అనేది ప్రజలకు పార్టీ నేతలు వివరించాలనాన్నరు.

ఇప్పటికే వ్యవస్థలను గాడిలో పెట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలు ప్రారంభిస్తామని పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం

**ముఖ్యమంత్రి సహాయనిధికి ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.10 లక్షల విరాళం అందచేశారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ నేతృత్వంలో చంద్రబాబును ఉండవల్లి నివాసంలో కలిసి రూ.10,46,169 చెక్కును అందించారు. సీఎంకు చెక్కును అందజేసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు డి.గోపాలకృష్ణ, వరప్రసాద్ తదితరులున్నారు. గతేడాది విజయవాడలో వచ్చిన వరదల కారణంగా సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు తమవంతుగా విరాళంగా ఇచ్చినట్టు వారు తెలిపారు. దాతృత్వాన్ని ప్రదర్శించిన బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు.**



# ఒక్క మాటా మాట్లాడొద్దు!



- వైసీపీ తెరవెనుక డ్రామాలపై 'సుప్రీం' సీరియస్
- చంద్రబాబుపై కేసులు సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్ డిస్మిస్
- ఇలాంటి పిటిషన్లూ వాదిస్తారా? అంటూ సీనియర్ న్యాయవాదికి చీవాట్లు
- పిచ్చి పిటిషన్‌తో పరువు పోగొట్టుకున్న హైకోర్టు న్యాయవాది

ఢిల్లీ: ఏపీ సీఎం చంద్రబాబుపైవున్న సీఐడీ కేసులను సీబీఐకి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏడు కేసులు సీబీఐకి బదిలీ చేయాలంటూ హైకోర్టు న్యాయవాది బి బాలయ్య సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది పూర్తిస్థాయిలో తప్పుడు పిటిషన్ అని జస్టిస్ బేలా త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్‌కు సంబంధించి ఒక్క మాట మాట్లాడినా భారీగా జరిమానా విధిస్తామని జస్టిస్ బేలా త్రివేది తీవ్రస్థాయిలో హెచ్చరించారు. చంద్రబాబుపై జగన్ హయాంలో నమోదు చేసిన కేసుల్ని ఉటంకిస్తూ.. ఇప్పుడు ఆయన సీఎం అయ్యారు కాబట్టి దర్యాప్తును ప్రభావితం చేస్తారని, వాటిని సీబీఐకి ఇవ్వాలన్నది బాలయ్య దాఖలు చేసిన పిటిషన్ సారాంశం.

వైసీపీ హయాంలో మాజీ సీఎం చంద్రబాబును ఇబ్బంది పెట్టేందుకు ఆయనపై అక్రమ కేసులు బనాయించింది వైసీపీ సర్కారు. స్కిల్ డెవలప్మెంట్ కేసు మొదలు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ వరకు చంద్రబాబుపై నమోదు చేసిన కేసులన్నీ బూటకపు కేసులే. వైసీపీ ప్రభుత్వం నమోదు చేసిన తప్పుడు కేసులను న్యాయస్థానంలో సమర్థంగా ఎదుర్కొన్న చంద్రబాబు.. బెయిల్‌పై విడుదలై ఏపీ ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఈక్రమంలోనే చంద్రబాబుపై నమోదైన సీఐడీ కేసులను సీబీఐకి బదిలీ చేయాలంటూ తాజాగా సుప్రీం కోర్టులో హైకోర్టు న్యాయవాది బి బాలయ్య పిటిషన్ దాఖలు చేశారు. బాలయ్య తరపున పిటిషన్‌పై వాదనలు వినిపించడానికి సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ సిద్ధమవగా.. ఇలాంటి పిటిషన్లను కూడా మీరు వాదిస్తారా? అంటూ ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పనికిమాలిన పిటిషన్లు వేసి.. వాదనలకు ఎలా సిద్ధమవుతారని వెటకారంగా ప్రశ్నించడంతో లాయర్ పరువు పోయినట్లయింది. ఇలాంటి కేసుల్లో కూడా మీలాంటి సీనియర్లు హాజరవుతారని అసలు ఊహించలేదంటూ సుప్రీం ధర్మాసనం అసహనంతో వ్యాఖ్యానించింది. ఒక్కమాట కూడా మాట్లాడొద్దంటూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది.

వైసీపీ హయాంలో చంద్రబాబుపై పెట్టిన కేసులను సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మానసనం తీవ్రస్థాయిలో స్పందించడం.. తెరవెనుక పాత్ర పోషిస్తోన్న వైసీపీకి చెంపపెట్టు. పిటిషన్ వేసింది హైకోర్టు న్యాయవాదే అయినా.. తెరవెనుక సూత్రధారి వైసీపీయేనన్నది జగమెరిగిన సత్యం. న్యాయవ్యవస్థను అడ్డం పెట్టుకుని అడ్డగోలు రాజకీయం చేయడంలో వైసీపీది సెపరేట్ రూట్ అని గతంలో అనేక సందర్భాంల్లో బహిర్గతమైంది. ఎవరో ఒకరి పేరిట కోర్టుల్లో పిటిషన్లు వేయించడం.. వాదనలు జరిగే సమయంలో తమకు కావాల్సినవి లాయర్‌తో పలికించడం.. అవే వాస్తవాలన్నట్టు సొంత మీడియాలో విస్తృత ప్రచారానికి దిగడం వైసీపీకి పరిపాటి. పైశాచిక రాజకీయాలకు పురుడుపోసే వైసీపీ.. కోర్టుల్లో పిటిషన్లు వేయడంలోనూ చావు తెలివితేటలు ప్రదర్శించిన సందర్భాలు లేకపోలేదు. జర్నలిస్టు పేరిటో.. సామాజికవేత్త పేరిటో.. మరోసారి నిరుపేద అంటూనో.. పిటిషన్లు వేయించడం.. వాటిని వాదించడానికి అత్యంత ఖరీదైన లాయర్లను మాట్లాడుకోవడం వైసీపీకి కొత్త కాదు. అలా, ప్రస్తుత పిటిషన్‌లో పాత్రధారిగా నిలిచిన లాయర్ బాలయ్య పరువు.. సుప్రీంకోర్టు స్పందించిన తీరుతో పాతాళానికి చేరింది.

వాస్తవానికి చంద్రబాబుపై కేసులు పెట్టినప్పుడు.. తప్పుడు ఆధారాలు సృష్టించినప్పుడు.. కనీసం నోటీసులివ్వకుండా చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు సీఐడీ విభాగం.. జగన్‌రెడ్డి చేతుల్లో ఉంది. జగన్ మానసిక ఆనందం కోసం.. రాజకీయ లక్ష్యాల కోసం ఎంతటి దురాగతాలకు పాల్పడాలో సీఐడీ విభాగం అంతా చేసింది. ఇప్పుడు అధికారం మారడంతో.. అదే సీఐడీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లడం.. వైసీపీ దుర్మార్గ రాజకీయానికి పరాకాష్ట. కాకపోతే.. న్యాయవ్యవస్థను అడ్డుపెట్టుకుని చంద్రబాబుపై బురద చల్లాలని వైసీపీ అగ్రనేతలు చేసిన ప్రయత్నంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది.. మరో హైకోర్టు లాయర్ పరువు పోగొట్టుకున్నారు.

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా గద్దెనెక్కింది మొదలు చంద్రబాబుపై కక్షగట్టి.. 22 కేసులు నమోదు చేయించాడు. 2020లో 5, 2021లో 9, 2022లో 2, 2023లో 6 బూటకపు కేసులు పెట్టారు. మంగళగిరిలోని సీఐడీ పోలీస్‌స్టేషన్‌లో 2023లో రెండు, 2022లో ఒకటి, 2021లో మూడు, 2020లో రెండు మొత్తం 8 కేసులు నమోదు చేశారు. ఉచిత ఇసుక పాలసీలో అవకతవకల ఆరోపణలు, సీఆర్‌డీఏ, రాజధాని, ఇన్నర్‌రింగు రోడ్డు మాస్టర్‌ప్లాన్ నిర్ణయాల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేసు, ఏపీ ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, అధికార దుర్వినియోగంవంటి ఆరోపణలతో చంద్రబాబుపై సీఐడీ కేసులు నమోదు చేసింది. ఈ కేసులను సీబీఐకి అప్పగించాలంటూ దాఖలైన పిటిషన్‌పై 'సుప్రీం కోర్టు ధర్మాసనం' చేసిన వ్యాఖ్యానం చాలు.. ఇవన్నీ ఎంత బూటకపు చెత్త కేసులో అర్థం చేసుకోవడానికి.

వైఎస్ జగన్‌పై నమోదైన నేరపూరిత కేసుల్లో రోజువారి విచారణకు హాజరై.. 'నేను అక్రమాస్తులు సంపాయించలేదు' అని నిరూపించుకోలేక దశాబ్దంపైగా రకరకాల కోర్టుల్లో పిటిషన్ల మీద పిటిషన్లు వేసి ఏళ్ల తరబడి కేసుల నుంచి తప్పించుకుంటున్న జగన్, ఎదుటివాళ్ల నిజాయితీని ఓర్వలేక కుట్రలు పన్ని తప్పుడు కేసులుపెట్టి కక్ష సాధించడమే కాకుండా.. మళ్లీ ఇలా కోర్టులకు పంపి చివాట్లు తినేలా కుట్రలు చేస్తున్నాడు. సొంత ఇంట్లో బాబాయిని గొడ్డలితో చంపించిన కేసులో సీబీఐ దర్యాప్తు వద్దన్న కిరాతక మనస్తత్వమున్న జగన్.. ఎదుటివాళ్లమీద బురద జల్లి కోర్టులలో పిటిషన్లు వేయించే పైశాచిక మనస్తత్వాన్ని మాత్రం ప్రదర్శిస్తున్నాడు. కాలమెప్పుడూ ఒకే తీరున ఉండదు. న్యాయస్థానాల్లో అక్షింతలే కాదు, శిక్షలు పడే కాలమూ ఎంతో దూరం లేదు!

## జీవో 117 ఉపసంహరణపై

# అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం

- ఉపాధ్యాయ బదిలీ చట్టంపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ
- త్వరలోనే ప్రతి శనివారం నో బ్యాగ్ డే
- ఉపాధ్యాయులకు ఇకపై ఒకటే యాప్
- ప్రజాభిప్రాయసేకరణ కోసం త్వరలోనే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూ ప్రింట్
- అధికారులతో సమీక్షలో మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్యరథం): పాఠశాల విద్యలో గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన జీవో 117 ఉపసంహరణపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేసిన తర్వాత అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలని అధికారులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో మంగళవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. జీవో 117 ఉపసంహరణపై ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పాఠశాల విద్య డైరెక్టర్ నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో వచ్చిన అభిప్రాయాలను, సూచనలను ఈ సందర్భంగా మంత్రికి అధికారులు వివరించారు. ఆయా సూచనలను పరిగణనలోకి తీసుకుని ఏ విద్యార్థి కూడా డ్రాప్ అవుట్ అవకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అతి త్వరలోనే తీసుకురానున్న ఉపాధ్యాయుల బదిలీ చట్టంపైనా సమావేశంలో చర్చించారు. ఈ చట్టంపై ఉపాధ్యాయులు, సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. అదేవిధంగా సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి విద్యార్థులకు కో కరిక్యులమ్ యాక్టివిటీస్ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ఉపాధ్యాయులకు ఇప్పుడున్న అనేక యాప్‌ల స్థానంలో ఒకటే యాప్‌ను రూపొందించే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వాస్తవ సంఖ్యను నిర్ధారించేందుకు అపార్ ఐడీని అనుసంధానించే కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం అతి త్వరలోనే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూ ప్రింట్‌ను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి లోకేష్ ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖలో చేపట్టబోయే సంస్కరణలపైనా సమావేశంలో విపులంగా చర్చించారు. ఈ భేటీలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ వి.విజయ్ రామరాజు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.




## మంగళగిరిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి

# శరవేగంగా అడుగులు

- ఆసుపత్రి భవన నమూనాను పరిశీలించిన మంత్రి నారా లోకేష్
- త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



అమరావతి (చైతన్యరథం): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం చినకాకాని వద్ద వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని అధికారులను మంత్రి లోకేష్ ఆదేశించారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణంపై అధికారులతో మంగళవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. అధికారులు ప్రదర్శించిన ఆసుపత్రి భవన నమూనాను పరిశీలించారు. దీనిపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆసుపత్రి అని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే ఆసుపత్రిని మంజూరు చేశామన్నారు. దేశంలోనే అత్యుత్తంగా ఉండేలా ఆసుపత్రిని తీర్చిదిదాలన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ది భార్గవ్ గ్రూప్ ఎండీ ఏ.భార్గవ్, డీజీఎమ్ కిషోర్, సీనియర్ ఇంజనీర్ అనిల్, ఏపీఎమ్ఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, వీసీ అండ్ ఎండీ పీఎస్ గిరీష, వాస్తు కన్సల్టెంట్ జయరామిరెడ్డి, ఏపీఎమ్ఎస్ఐడీసీ సీఈ కె.శ్రీనివాసరావు, ఎస్ఈ వి.చిట్టిబాబు, ఈఈ సీవీ రమణ, డీఈఈ ఎమ్.హనుమంతరావు నాయక్, ఏఈ జి.గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.




## అన్న క్యాంటీన్లు, సీఎంఆర్ఎఫ్‌కు పలువురి విరాళాలు

### - మంత్రి లోకేష్‌ను కలిసి చెక్కులు అందజేత

అమరావతి (చైతన్యరథం): పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు, ముఖ్యమంత్రి సహాయ నిధికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేష్‌ను కలిసి చెక్కులు అందజేశారు. అన్న క్యాంటీన్‌కు ఏలూరుకు చెందిన గుత్తా వెంకట కృష్ణారావు రూ.50వేలు, గుత్తా శారదాదేవి రూ.50వేలు, గత్తా స్వరూపారాణి రూ.లక్ష విరాళం అందించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన జొన్నలగడ్డ శేఖర్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10వేల చెక్కును అందజేశారు. కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకునేందుకు, అన్న క్యాంటీన్‌కు చేయూత ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారిని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు.






# సమస్యలు తీర్చి ఆదుకోండి




- మంత్రి నారా లోకేష్‌కు జనం విన్నపాలు
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తిచేయండి
- భూమిపై హక్కులు కల్పించి న్యాయం చేయాలి
- 58వ రోజు ప్రజాదర్బార్‌కు అర్జీదారుల బారులు
- అందరికీ అండగా ఉంటామని మంత్రి లోకేష్ భరోసా

ఉండవల్లి (చైతన్యరథం): భూమిపై హక్కులు కల్పించాలని, వృద్ధాప్య, వితంతు, ఒంటరి పెన్షన్లు అందించాలని, అర్హతకు తగ్గ ఉద్యోగ అవకాశం కల్పించాలని, వైద్యానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు.. రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌కు విన్నవించుకున్నారు. ఉండవల్లి నివాసంలో మంగళవారం మంత్రి లోకేష్ నిర్వహించిన 58వ రోజు ప్రజాదర్బార్‌కు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి సమస్యలపై అర్జీలు అందజేశారు.ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి.. ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని వారికి భరోసా ఇచ్చారు. పలు విజ్ఞప్తుల పరిష్కారానికి అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

## పొలాన్ని ఆన్‌లైన్ చేయండి

తన భార్య పేరుతో ఉన్న 4 ఎకరాల పొలాన్ని తన పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకు చెందిన వై.రామ్ గోపాల్.. మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. రెండేళ్ల క్రితం నా సతీమణి క్యాన్సర్ వ్యాధితో మరణించింది. ఆమె పేరుపై బాపట్ల మండలం మురుకొండపాడులో 4 ఎకరాల పొలం ఉంది. అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ హక్కులు కల్పించలేదని రామ్ గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

సత్రశాల డ్యాం నిర్మాణంలో తమ 3.10 ఎకరాల పొలం ముంపునకు గురైందని, హామీ ఇచ్చిన విధంగా ఐటీఐ చదివిన తనకు అర్హతకు తగిన ఉద్యోగ అవకాశం కల్పించాలని పల్నాడు జిల్లా మాచర్ల మండలం ఏకోనాంపేటకు చెందిన ఎస్.ఈదయ్య కోరారు. నాకు ఎలాంటి ఆధారం లేదు. ఉద్యోగం కోసం గత పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. అయినా పట్టించుకోవడం లేదని వాపోయారు. పరిశీలించి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

వ్యవసాయం గిట్టుబాటుకాక విజయవాడ వలస వచ్చిన తనకు మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగ అవకాశం కల్పించాలని బి.మల్లన్న విజ్ఞప్తి చేశారు. కర్నూలు జిల్లా నందవరం మండలం రాయచోటిలో నివాసం ఉండే తాము ఐదెకరాలు కౌలుకు తీసుకుని మిరప సాగుచేయగా నష్టం వచ్చింది. దీంతో గ్రామంలో రూ.6లక్షల వరకు అప్పులయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవనోపాధి కోసం కుటుంబంతో సహా విజయవాడ వచ్చిన తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం సంతేకూడ్లూరులో నెలకొని ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు.. మంత్రి లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సమ్మర్ స్టోరేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు కూడా ప్రారంభించారు. వైసీపీ పాలనలో పెండింగ్ పనులు పూర్తిచేయకుండా నిర్లక్ష్యం వహించడంతో ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమ్మర్ స్టోరేజీ నిర్మాణాన్ని పూర్తిచేయడంతో పాటు ఎగువ ప్రాంతానికి తాగునీటి సరఫరా కోసం మరో రెండు వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరు చేయాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

గత వైసీపీ ప్రభుత్వంలో బహుజనులకు సంబంధించి రద్దు చేసిన 26 సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతో పాటు ఉద్యమకారులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏలూరుకు చెందిన బహుజన సేన ప్రతినిధులు.. మంత్రి లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. బహుజన ఉద్యమకారులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎల్జీఎస్‌గా పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని ఏపీ డేటా ఎంట్రీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు.. మంత్రి లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తమను కాంట్రాక్టు ఉద్యోగాలుగా గుర్తించడంతో పాటు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్‌లో ఎల్జీఎస్‌లుగా పనిచేస్తున్న వారిని ఎమ్ఎన్వో, ఎఫ్ఎన్వో, ఆఫీసు సబార్డినేట్‌గా, కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిణించాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

మదర్సాల్లో పనిచేస్తున్న విద్యా వాలంటీర్లను క్రమబద్ధీకరించడంతో పాటు గత వైసీపీ పాలనలో పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గుంటూరుకు చెందిన మదర్సా విద్యా వాలంటీర్లు.. మంత్రి లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

తిరుపతి టీఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ అయిన శ్రీ వేంకటేశ్వర ఆటో, ట్యాక్సీ వర్కర్స్ యూనియన్ సభ్యులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సంస్థ ప్రతినిధులు .. మంత్రి లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత 20 ఏళ్లుగా తిరుపతి, తిరుమలలో ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అద్దె ఇళ్లల్లో జీవనం సాగిస్తున్న తమకు సొంత ఇంటి కల నెరవేర్చాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

చిత్తూరు జిల్లా, ఐరాల మండలం, పొలకల పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు.. మంత్రి లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పదో తరగతి పరీక్షా కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు 4 కి.మీ దూరంలోని ఎర్రచెరువుపల్లి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.













# జగన్‌రెడ్డి ఆర్థిక విధ్వంసానికి చెంపపెట్టు



- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశాడు
- ఆర్థిక సూచీలో 17వ స్థానానికి దిగజార్చాడు
- నీతి ఆయోగ్ నివేదికతో నిజాలు బట్టబయలు
- ఆయన పాలనలో జరిగిన అవినీతి ఓ రికార్డ్
- తెచ్చిన డబ్బంతా తాడేపల్లి ప్యాలెస్‌కు పంపాడు
- ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు ధ్వజం
- ఆర్థిక గణాంకాలపై చర్చకు రావాలని సవాల్

మంగళగిరి (చైతన్యరథం): నీతి ఆయోగ్ నివేదిక జగన్‌రెడ్డి సాగించిన ఆర్థిక విధ్వంసానికి చెంపపెట్టు లాంటిదని ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు ధ్వజమెత్తారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లా డారు. జగన్‌రెడ్డి నిర్వాకంతో అన్ని రంగాలు దారుణ విధ్వంసానికి గురై వెంటిలేటర్‌పై ఉన్న పేషెంట్‌లా ఏపీ పరిస్థితి తయారైందన్నారు. గతంలో ఆర్థిక సూచీలో 3, 4వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి 17వ స్థానానికి దిగజార్చాడని మండిపడ్డారు. జగన్ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం మెరుగ్గా ఉన్నప్పటికీ పబ్లిక్ అకౌంట్స్ ఖాతాలోనే రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసి అభివృద్ధి కోసం ఖర్చు పెట్టింది మాత్రం శూన్యమన్నారు. గత పాలకుల విధ్వంసం వల్ల ప్రస్తుత రాష్ట్ర ప్రభు త్వానికి అప్పు తేగలిగే సామర్థ్యం జీరో అని నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేయడం జగన్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదన్నారు. వెనుకబడిన రాష్ట్రాలుగా పేరున్న బీహార్, ఒరిస్సాలు సైతం ఆర్థికంగా ముందున్నాయని, ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు రాష్ట్ర అభివృద్ధి కోసం పాలన చేశారు కానీ జగన్‌లా అవినీతి కంపుతో కుళ్లిపోలేదని మండిపడ్డారు. 2019-24 మధ్య జగన్‌రెడ్డి హయాంలో జరిగినంత అవినీతి అరాచ కం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగలేదని, ఇక్కడ చేసినన్ని అప్పులు ఏ రాష్ట్రంలో నూ చేయలేదని వ్యాఖ్యానించారు. ఆదాయానికి, అప్పులకు పొంతన లేకుండా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడని దుయ్యబట్టారు. సంవత్సరానికి రూ. 46 వేల కోట్లు అసలు, వడ్డీ కోసం చెల్లించాల్సిన భారం కూటమి ప్రభుత్వంపై పడిం దన్నారు.

## అప్పులు తెచ్చిన డబ్బు తాడేపల్లి ప్యాలెస్‌కే

ఆర్థిక వేత్తలకే ఆశ్చర్యం కలిగించేలా ఆర్థిక విధ్వంసం చేసిన జగన్‌రెడ్డి అప్పులు తెచ్చిన డబ్బంతా తన అవినీతితో తాడేపల్లి ఖజానాకు తరలించుకున్నాడని ధ్వజమె త్తారు. నాడు-నేడు పేరుతో అవినీతి, పేదలకు సెంటు భూమి పేరుతో భూ సేకరణ లో రూ.8 వేల కోట్ల అవినీతి, లే అవుట్ల చదును పేరుతో అవినీతి, లిక్కర్, ఇసుక ఇలా ఏ రంగాన్ని వదలకుండా అన్నింటా జగన్‌రెడ్డి అండ్ కో అవినీతికి పాల్పడ్డారు. రంగులు వేయడం, తీయడం కోసం రూ.4 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్లు అనవ సరపు ఖర్చులు, ఆ ఖర్చుల్లో వాటాలు, ఆఖరికి పిల్లలకిచ్చే చిక్కీలలో కూడా అవినీతికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి స్కీంలో కూడా ఉత్తుత్తి బటన్ నొక్కుడుల పెండింగ్ బిల్లులు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు కలిపి సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన పెండింగ్ బిల్లులు రూ.48,000 కోట్లు, అప్‌లోడ్ చేయాల్సిన బిల్లులు రూ. 98,000 కోట్లు మొత్తంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసే నాటికి రాష్ట్రంలో రూ.1,42,000 కోట్లు పెండింగ్ బిల్లులున్నాయని తెలిపారు. ఎక్కువ ఆదాయం వచ్చే మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకలకు కూడా అంతస్థాయిలో పెండింగ్ బిల్లులు లేవన్నారు. ఉద్యోగులకు రూ.20,000 వేల కోట్ల బకాయిలు పెట్టి పెన్షన్ ఇవ్వాల్సి వస్తుందని ఉద్యోగస్తుల రిటైర్‌మెంట్ వయసు 62కి పెంచి అస్తవ్యస్త విధానాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వెంటిలేటర్‌పైకి నెట్టాడన్నారు.

## ఆర్థిక ఇబ్బందులున్నా రాష్ట్ర పునర్నిర్మాణం

ఇన్ని ఇబ్బందులున్నా చంద్రబాబు అధికారంలోకి వస్తూనే పెన్షన్‌ను రూ.4,000 కు పెంచారు. దీపం-2 కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారు. రైతులకు ధాన్యం బకాయిలు రూ.1600 కోట్లు, ఆరోగ్య శ్రీకి రూ.1700 కోట్లు, డిస్కామ్‌లకు బకాయి ల చెల్లింపు ఇలా వివిధ రంగాలలో రూ.22,000 కోట్లు గత ప్రభుత్వ బకాయిలను కూటమి ప్రభుత్వం తీర్చింది. తెలుగుదేశం ప్రభుత్వం 55 శాతం మూలధన వ్యయం కోసం ఖర్చు చేస్తే జగన్‌రెడ్డి ప్రభుత్వం 22 శాతం మాత్రమే ఖర్చు చేసింది. ఒక్క ప్రాజెక్ట్ కట్టకుండా, ఒక్క రోడ్డు వేయకుండా, ఆస్తులు కూడబెట్టకుండా మూడు రాజధానులంటూ అమరావతితో సహా రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి వినాశనం చేశాడు. మూలధనానికి ఖర్చు పెట్టకుంటే రాష్ట్ర అభివృద్ధి జరగదని, రాష్ట్రాన్ని పునర్ని ర్మించే దిశగా కేంద్రం సహకారం అందిస్తామన డంతో తిరిగి రాష్ట్రం నిలబడుతుందని నమ్మ కం ఏర్పడింద న్నారు. జగన్‌రెడ్డి రూపాయి ఇచ్చి వంద దోచాడన్న సంగతి ప్రజలు కూడా గమనించాలి. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని నిలబెడతామని చంద్రబాబు చెప్పారు. వైసీపీ నేతలు ఎన్ని అసత్య ప్రచారా లు చేసినా కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలులో వీసమెత్తు కూడా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

## డొల్ల మాటలొద్దు.. అంకెలతో చర్చకు రావాలి

దావోస్ సదస్సులో పారిశ్రామికవేత్తలు ఆంధ్రలో పెట్టుబడులకు సుముఖంగా ఉన్నారు. త్వరలో వచ్చే పెట్టుబడులతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో రాష్ట్రం కోలుకుని అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందని ఆర్థిక వేత్తలు సైతం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్ర ఆదాయానికి బొంబాయి ఉంది. ఆంధ్ర ఆదాయానికి చంద్రబాబు ఉన్నాడు అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వ్యాఖ్యానించడం చంద్రబాబు పేరుకున్న బ్రాండ్‌ను చాటుతుంది. ప్రభుత్వంలో అవినీ తిని అరికట్టి, గత ప్రభుత్వంలోని అవినీతిని కూడా వెలికితీసి అందుకు బాధ్యులైన వారిని శిక్షించే చర్యలు ఖచ్చితంగా ఉంటాయి. ఏదేమైనా రాష్ట్రం చీకటిరోజుల నుంచి వెలుతురులోకి వచ్చే సమయం ఆసన్నమైంది. చిన్న చిన్న ఇబ్బందులను ప్రజలు కూడా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక గణాంకాలపై అసత్య ప్రచా రం చేస్తున్న వైసీపీ నేతలు నీతి ఆయోగ్ నివేదిక చూసి మాట్లాడాలి.. డొల్ల మాటలతో కాకుండా అంకెలతో చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# క్రీడల్లో ఏపీ ఖ్యాతిని పెంపొందించాలి

- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు



తిరుపతి (చైతన్యరథం): క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ కీర్తిప్రతిష్టతలను ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపచేయాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో మంగళవారం పలువురు క్రీడాకారులు శాప్ ఛైర్మన్‌ను కలిశారు. యోగాలో గిన్నిస్ రికార్డ్ సాధించిన తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన సీహెచ్ వసంత లక్ష్మి స్పోర్ట్స్ కాంప్లెక్సులోని డీఎస్ఏ కార్యాలయంలో శాప్ ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2023, డిసెంబర్ 3వ తేదీన యోగాలో భాగంగా 3:42 గంటల పాటు సమకోనాసనం వేసి పాత రికార్డులను బ్రేక్ చేసినట్లు వివరించారు. దీనికిగానూ 2024 డిసెంబర్ 29న తన పేరును గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆమెను శాప్ ఛైర్మన్ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఇటీవల ఢిల్లీలో జరిగిన ఖోఖో తొలి ప్రపంచకప్‌లో ఇండియా నుంచి రిఫరీగా వ్యవహరించిన ఎస్.సురేష్‌కుమార్.. శాప్ ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖోఖో నేషనల్స్‌లో ఏపీ నుంచి మూడుసార్లు ప్రాతినిథ్యం వహించానని, అలాగే సీనియర్ సౌత్ జోన్ నేషనల్స్‌లో ఎస్వీ యూనివర్సిటీ భాగస్వామ్యంతో మూడుసార్లు పాల్గొని సిల్వర్ మెడల్ కూడా సాధించినట్లు సురేష్ కుమార్ వివరించారు. ప్రస్తుతం యాదమర్రి మండలం కొటాలం జెడ్పీ ఉన్నతపాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ ఆయనను అభినందిస్తూ భవిష్యత్తులో ఖోఖో క్రీడాకారులకు మరిన్ని మెళకువలు నేర్పించి ఉత్తమ క్రీడాకారులుగా తయారుచేయాలని సూచించారు. క్రీడల్లో ఏపీ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డీఎస్డీఓ సయ్యద్ సాహెబ్, చిత్తూరు డీఎస్డీఓ బాలాజీ, కోచ్‌లు పాల్గొన్నారు.

# 31న పెనుగొండకు సీఎం చంద్రబాబు

- వాసవీ కన్యకాపరమేశ్వరికి పట్టువస్త్రాలు
- ఆత్మార్పణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి
- ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్
- ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండటంపై హర్షం



మంగళగిరి (చైతన్యరథం): పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పెనుగొం డ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మాఘశు ద్ధ విదియ రోజు ఈనెల 31వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని, స్థానిక నాయకులు పాల్గొ ని అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని విజయ వంతం చేయాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఈ వేడుకలు జరపాలని కోరారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళ వారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఆనాడు చంద్రబాబు ఆదేశాలతో యువ నాయకుడు లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆర్యవైశ్యుల సమస్యలు విని వారి గౌరవాన్ని పెంచేందు కు చర్యలు తీసుకున్నారు. వాణిజ్య వర్గాల కు మేలు చేసేలా ప్రణాళికలు రచించారు. వాటిని మేనిఫెస్టోలో పెట్టారని గుర్తు చేశారు. ఆర్యవైశ్యుల కుల దేవత ఇల వేల్పు కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఘనమైన చరిత్ర ఉంది. వెంకన్నస్వామికి, విజయ వాడ కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించినట్లుగానే ఆర్యవైశ్యుల ఇలవేల్పు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం రోజున ప్రభుత్వం అధికారికంగా నిర్వహి స్తుండటం అభినందనీయన్నారు. పెనుగొండ ఆలయం 2,600 సంవత్సరాల చరిత్ర కలిగి ఉంది. ఈ ఆలయంలో పట్టువస్త్రాలు సమర్పించాలని కోరిన వెంటనే చంద్రబాబు ఆర్య వైశ్యులపై ఉన్న గౌరవంతో అంగీకరించారని తెలిపారు. ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ప్రభుత్వం జీవో నెంబర్ 189 కూడా విడుదల చేసి ఆర్య వైశ్యులపై ఉన్న అభిమానాన్ని చాటుకుందన్నారు. ఆర్యవైశ్య సంఘాలు, అమ్మవారి దేవా లయాలు 300కు పైనే ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై ఆలయాల సిబ్బంది, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్యవైశ్యుల కోరిక మేరకు మాఘశుద్ధ విదియ ఈనెల 31వ తేదీన వచ్చింది. ఆ రోజునే అమ్మవారు ఆత్మార్పణ చేసుకుంటూ విశ్వరూపిణీ మాతగా తన నిజ స్వరూపం చూపించారు. ఆ రోజును రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ ఆర్యవైశ్య కులసంఘాలు ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలుపుకున్నామని వివరించారు. జగన్ ఆర్యవైశ్య పదం వినపడితే చాలు చిరాకుపడేవాడు. ఆర్యవైశ్య నాయకులు, ఆర్యవైశ్య సంఘాలను పట్టించుకోలేదు. వారి విన్నపాలను జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ప్రభుత్వంలో ఆర్యవైశ్య పదమే లేకుం డా చేసి ముందుకెళ్లింది. అందుకు నిరసిస్తూ ఆర్యవైశ్యులు అనేక ఉద్యమాలు, పోరాటా లు చేశారు. పార్టీలకు అతీతంగా రోడ్లపైకి వచ్చారు. వైసీపీ హయాంలో ఆలయాలు, అం దులో సిబ్బంది, సంఘాలను ఇబ్బంది పెట్టారు..సత్రాలను కూల్చారు..ఆర్యవైశ్యుల వ్యాపారాలపై దెబ్బతీసి ఆర్యవైశ్యులను చిత్రహింసలకు గురిచేసి పీల్చి పిప్పిచేశారని ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో ఆర్యవైశ్య సంఘాలు కోల్పోయిన గౌరవాన్ని కూటమి ప్రభుత్వం పెంచింది.. వారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాలకు స్థానిక నాయకులు కూడా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకోవాలని పిలుపునిచ్చారు. కటింగ్ మాస్ట ర్లు, స్క్రిప్ట్ మాస్టర్లు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే నమ్మేవారు లేరని హితవుపలికారు.

# ప్రాణహాని ఉంది..

# రక్షణ కల్పించండి

- కుటుంబంలో ముగ్గురిని హతమార్చారు
- ఆడవాళ్లపై అమానుషంగా ప్రవర్తించారు
- ప్రజావినతుల్లో బాధితురాలి కన్నీటి పర్యంతం
- అర్జీలు స్వీకరించిన మంత్రి సవిత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి

మంగళగిరి(చైతన్యరథం): తమకు ప్రాణహాని ఉంది..రక్షణ కల్పించాలని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంకు చెందిన బాధితురాలు కార్ధాల లక్ష్మి, కుటుంబ సభ్యులు మంగళవారం ప్రజావినతుల కార్యక్రమంలో విన్నవించుకున్నారు. అకారణంగా తమపైకి కత్తులు, గొడ్డళ్లతో మూకుమ్మడిగా దాడికి వచ్చి తమ కుటుంబంలోని ముగ్గురిని హతమార్చి ఆడవారిపై అమానుషంగా ప్రవర్తించారని కన్నీటి పర్యంతమయ్యారు. వారివల్ల కుటుంబంలో పెద్దదిక్కు కోల్పోయామని, తమకు ప్రభుత్వం అండగా రక్షణ కల్పించాలని కోరారు. మంత్రి సవిత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అర్జీలు స్వీకరించారు.

– తమ పొలానికి దొంగ డాక్యుమెంట్లు పుట్టించి పొలంలోకి వెళితే తమపై దౌర్జన్యం చేస్తున్నారని గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామానికి చెందిన కొప్పురావూరి సూర్యలక్ష్మి ఫిర్యాదు చేశారు. తమపై దౌర్జన్యం చేస్తున్న ఉన్నం నరసింహా రావు, కరణం గంగయ్య కరణం సీతామహాలక్ష్మిలపై చర్యలు తీసుకుని దొంగ డాక్యు మెంట్లను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రం ఇచ్చారు.





– తనకు వారసత్వంగా వచ్చిన భూమిని వైసీపీ నేతల ఒత్తిడితో అధికారులు అక్రమంగా మరొకరికి ఆన్‌లైన్ చేశారని కడప జిల్లా పోరుమామిళ్ల మండలానికి చెందిన షేక్ ఆయూబ్ ఫిర్యాదు చేశారు. విచారించి అక్రమ ఆన్‌లైన్‌ను రద్దు చేసి ఈ అక్రమానికి పాల్పడిన వ్యక్తులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

– కర్నూలు జిల్లా ఆస్పరి మండలం తంగరడొన గ్రామంలో నిర్మాణంలో ఉన్న పదో తరగతి స్కూల్ బేస్ మట్టంతో ఆగిపోయింది.. స్కూల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఎంపీటీసీ జి.నరసన్న విజ్ఞప్తి చేశారు.

– ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి గ్రామ పరిధిలో లీజుకు తీసుకున్న చేపల చెరువలో వైసీపీకి చెందిన వారు 50 టన్నుల చేపలను దొంగిలించారని నాగరాజు అనే వ్యక్తి గ్రీవె న్స్‌లో అర్జీ ఇచ్చి వాపోయాడు. విచారించి దొంగలపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

– 20 ఏళ్లుగా తిరుపతిలో ట్యాక్సీలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు సొంత గృహాలు లేక అద్దె ఇళ్లలో అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని శ్రీ వెంకటేశ్వర షేర్ ఆటో యూనియన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి తమ కు ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.











## ఏబీవీ సస్పెన్షన్ కాలం క్రమబద్ధీకరణ

**- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**

అమరావతి (చైతన్యరథం): రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆయన సస్పెన్షన్ కాలాన్ని క్రమబద్ధీకరిస్తూ మంగళవారం నాడు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో రెండు దఫాలుగా ఏబీవీపై జగన్ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఆ కాలాన్ని విధులు నిర్వహించినట్టుగా క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

2020-2024 మధ్య రెండు సార్లు ఏబీవీ సస్పెండ్ అయ్యారు. 2020 ఫిబ్రవరి 2 నుంచి 2022 ఫిబ్రవరి 7 వరకూ మొదటి దఫా ఏబీవీని వైసీపీ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అలాగే రెండో విడతలో 2022 జూన్ 28 తేదీ నుంచి 2024 మే 30 తేదీ వరకూ మరోమారు సస్పెన్షన్ వేటు వేసింది.

ఈ రెండు విడతల సస్పెన్షన్ కాలాన్ని విధులు నిర్వహించినట్టుగా క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఆ కాలానికి ఏబీవీకి చెల్లించాల్సిన మొత్తం వేతనాన్ని, అలవెన్సులను చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. సస్పెన్షన్ వేటు పడకపోతే ఎంత మొత్తం ఇవ్వాలో ఆ మేరకు చెల్లించాల్సిందిగా ప్రభుత్వం స్పష్టం చేసింది.

కాగా.. ఇటీవలే ఏబీవీపై నమోదైన అభియోగాలను వెనక్కు తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇంటెలిజెన్స్ ఏడీజీగా ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఇజ్రాయెల్ నుంచి నిఘా పరికరాల కొనుగోలులో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఏబీ వెంకటేశ్వరరావుపై గత వైసీపీ ప్రభుత్వం ఆరోపించింది. అనంతరం ఆయనపై రెండు దఫాలుగా సస్పెన్షన్ వేటు వేసింది.






## ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా..

# అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

- ◆రోడ్ల మరమ్మతుల్లో నాణ్యత ముఖ్యం
- ◆అమృతధార పథకంలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు
- ◆పీఎంఏవై ఇళ్ల నిర్మాణం డిసెంబర్‌లోగా పూర్తి
- ◆సూర్యలంక, చీరాల బీచ్‌ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలి
- ◆బాపట్ల డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారధి

బాపట్ల (చైతన్యరథం): ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా బాపట్ల జిల్లా అభివృద్ధికి అధికారులంతా ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. జిల్లా అభివృద్ధి సమీక్షా (డీఆర్సీ) సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల, వేమూరు, పర్చూరు, చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్ర వర్మ, నక్కా ఆనందబాబు, ఏలూరి సాంబశివరావు, ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. సమావేశానికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలకు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆహ్వానం పలికారు.

### మరింత చిత్తశుద్ధితో పనిచేయాలి: మంత్రి పార్థసారథి

సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారథి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ప్రదేశ్-2047 లక్ష్యాలు సాధించడానికి అధికారులు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిబద్ధతతో పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రజల ఇబ్బందులు తొలగించడానికి గుంతలు రహిత రహదారుల కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. మరమ్మతు పనుల్లో గుత్తేదారులు నాణ్యత పాటించకపోతే ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. గుంతలు పూడ్చే కార్యక్రమంలో జాప్యంపై పలువురు ప్రజా ప్రతినిధులు ఆర్ అండ్ బి అధికారులను ప్రశ్నించారు. దీంతో సిఆర్ఎఫ్, ఎండిఆర్ఎఫ్ పెండింగ్ పనులపై మంత్రి ఆరా తీశారు. నిధులు ఇస్తున్నప్పటికీ ఎందుకు పనిచేయడం లేదని నిలదీశారు. పనులు ప్రారంభించకపోతే రద్దు చేయాలని, నిబంధనలు పట్టించుకోని గుత్తేదారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుత్తేదారులు సరిగా చేయకపోతే ఇంజినీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారన్నారని అసహనం వ్యక్తం చేశారు.

### ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు

అమృతధార పథకం కింద ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించే కార్యక్రమం త్వరలో చేపడతామని మంత్రి పార్థసారథి తెలిపారు. గతంలో జల జీవన్ మిషన్ పనులు వేగంగా చేపట్టకపోవడంతో నిధులు మురిగిపోయాయన్నారు. ఆ నిధులను అమృతధార పథకం కింద తెప్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందన్నారు. సాగునీటి కాలువల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలువల్లో తూటికాడ తొలగించాలని, మరమ్మతు పనులు వేగంగా చేపట్టాలన్నారు. 92 ఎత్తిపోతల పథకాల కింద 1.07 లక్షల ఎకరాలు పంటలు సాగు అవ్వాల్సిఉండగా 67 పథకాలు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. తాత్కాలిక మరమ్మతులు, సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

### డిసెంబర్‌లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి

పీఎంఏవై కింద మంజూరు చేసిన గృహాల నిర్మాణం డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రం ఇచ్చిన గడువులోగా నిర్మాణాలు చేయలేకపోతే నిధులు మురిగిపోతాయన్నారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో గృహాల నిర్మాణం వేగంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రూ.110 కోట్లతో బాపట్లలో ఉపాధి పనులు జరుగుతుండగా, రూ.31 కోట్ల పనులు మిగలడంపై అసహనం వ్యక్తం చేశారు. గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే ఆయా లేఅవుట్ లలో నిర్మాణం పూర్తిచేసిన గృహాలను ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రారంభించాలని మంత్రి చెప్పారు. లేఅవుట్లలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు.

### బీచ్‌ల అభివృద్ధికి ప్రతిపాదనలు

సూర్యలంక, చీరాల బీచ్‌ల అభివృద్ధిపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తామని మంత్రి పార్థసారథి చెప్పారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రానికి నివేదించామన్నారు. సర్వీస్ సెక్టార్లు పెరిగితే ఉపాధి అవకాశాలు, ఆదాయం పెరుగుతాయన్నారు. ఇందుకోసం రానున్న బడ్జెట్లో నిధులు కేటాయించేలా సీఎం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

బాపట్ల జిల్లాలో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మరో ఏడు వేల మెట్రిక్ టన్నుల సేకరణకు ప్రభుత్వం తాజాగా అనుమతించిందని మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతులకు డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. మరో 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

### విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు: మంత్రి గొట్టిపాటి

విద్యుత్ సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సూర్య ఘర్ పథకం కింద 334 యూనిట్లు ఏర్పాటు చేశామని, మరింత విస్తరింప చేయడానికి బ్యాంకులు సహకరించాలన్నారు. అద్దంకి నియోజక వర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటున్నామన్నారు. దెబ్బతిన్న పాత విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. పొలాలలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు అరికట్టడానికి, రాగి కొనుగోలు చేసే వ్యక్తులను పట్టుకోవాలన్నారు. సాగునీటి కాలువల పెండింగ్ బిల్లులపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కొరిశపాడు ఎత్తిపోతల పథకం భూసేకరణ పూర్తి చేయాలని, సమీక్షలో చర్చించిన అంశాలపై అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే ఫలితం ఉంటుందన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో మత్స్య సంపద వృద్ధికి నాలుగు లక్షల చేప పిల్లలు వేయాలన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఒకేసారి చేపలు పిల్లలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బల్లికురవ మండలంలోని కొనిదన, తదితర నాలుగు గ్రామపంచాయతీల్లో ఏడు నెలలుగా పనులు చేయకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. సర్పంచులను సంప్రదించి పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. బాపట్ల మండలం చింతగుంపల గ్రామంలో 80 విద్యుత్ స్తంభాలు నూతనంగా వేయాలని ఆదేశించారు. అన్న క్యాంటీన్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.

### కాలువల మరమ్మతులు చేపట్టాలి: మంత్రి అనగాని

సాగునీటి కాలువల మరమ్మతు పనులు అత్యవసరంగా చేపట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. వెల్లటూరు కాలువ పనుల్లో జాప్యం చేయరాదన్నారు. రేపల్లె నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన తనిఖీల్లో దస్త్రాలు చూపకుండా పలుమార్లు ఇబ్బందులు పెడుతున్న సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖలో డ్రోన్ల వినియోగంపై శిక్షణ, అవగాహన కల్పించాలన్నారు. ఆక్వా హబ్ ఏర్పాటుకు అధికారులు శరవేగంగా పనులు చేపట్టాలన్నారు. రేపల్లె రహదారులపై గుంతలు పూడ్చే కార్యక్రమంలో నాణ్యత లోపించిందన్నారు. టైల్స్ ముక్కలు వేసి గుంతలు పూడ్చడం వల్ల ప్రమాదాలు జరిగి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేకుండా పనిచేస్తే ప్రజలు చాలా ఇబ్బందులు పడతారన్నారు. బాధ్యతగా పనిచేయాలి, విధుల పట్ల శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు.

### బ్యాంకులు సహకరించాలి: ఎంపీ కృష్ణప్రసాద్

బాపట్లకు వైద్య కళాశాల నిర్మాణానికి మూడో విడతలో నిధులు విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రుణ సదుపాయం కల్పించాలని అధికారులకు సూచించారు. సూర్యఘర్ పథకానికి బ్యాంకులు సహకరించాలన్నారు.

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటి నీరు సరఫరా చేయడానికి రూ.3,500 కోట్లతో డీపీఆర్ పంపామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రకాశం బ్యారేజీ నుంచి వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని 18 మండలాలకు నీరు అందించేలా రూ.1,820 కోట్లతో నివేదించామన్నారు. నాగార్జునసాగర్ నుంచి ఐదు మండలాలకు నీరు ఇచ్చేలా రూ.450 కోట్లు, గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి రెండు మండలాలకు నీరు ఇవ్వడానికి రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. బాపట్ల ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపగా మంజూరు ప్రక్రియలో ఉందన్నారు. ఎన్ ఆర్ సి కేంద్రం మంజూరు అయిందని, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు కానుందన్నారు. డీఆర్సీలో సమీక్షించిన అంశాలన్నీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సాగునీటి కాలువల ఆక్రమణలను అరికట్టాలని మంత్రిని బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ కోరారు. ఎత్తిపోతల పథకాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. రహదారుల మరమ్మత్తులు త్వరగా పూర్తిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. గుంతలు పూడ్చే కార్యక్రమంలో నాణ్యత లోపించడంతో ప్రజల అవస్థలు పడుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. సూర్యలంక బీచ్ నిర్వహణ పంచాయతీకి అప్పగించాలి లేదా పర్యాటక శాఖ బాధ్యత తీసుకోవాలని మంత్రిని కోరారు. అడవి గ్రామంలో అటవీ శాఖ భూమి సేకరించి బోట్ షికారుకు అవకాశం కల్పించాలన్నారు. బీచ్ లో సౌకర్యాలు ఏర్పాటు చేసి, అభివృద్ధికి మరింత చొరవ చూపాలన్నారు.

లంక గ్రామాలలో తాడిగిరి పాలెం, పోతార్లంక ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు కోరారు. వివిధ పనులకు సంబంధించిన బిల్లులు నిలిచాయని, నిధుల విడుదలపై మండల స్థాయి అధికారులు పట్టించు కోవడం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు.

పర్చూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు నిర్వహణ అధ్వానంగా ఉందని శాసనసభ్యుడు ఏలూరు సాంబశివరావు చెప్పారు. 40 వేల ఎకరాలు ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి రైతులు సాగు చేసుకుంటున్నారని, ప్రస్తుతం నష్టాలు చవిచూస్తున్నారని వివరించారు. రైతులను ఆదుకోవాలని అన్నారు. కొత్త లేఅవుట్లలో తాగునీటి సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరారు. సిఆర్ఎఫ్ నిధులతో రోడ్లు నిర్మించలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. రహదారులు సరిగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మరమ్మత్తులు పనులు సరిగా జరగడం లేదని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

చీరాల నియోజకవర్గం ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి ఉందని, మరమ్మతు పనులు వేగంగా చేపట్టాలని చీరాల శాసనసభ్యుడు ఎం ఎం కొండయ్య మంత్రి దృష్టికి తెచ్చారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదన పంపి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కోడి రామ్మూర్తికి నివాళులర్పించిన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



విజయనగరం (చైతన్యరథం): కోడి రామ్మూర్తి వ్యాయమ సమాజం ఆధ్వర్యంలో మంగళవారం విజయనగరంలో నిర్వహించిన కలియుగ భీమ కోడి రామ్మూర్తినాయుడు ఆరాధన ఉత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు పాల్గొన్నారు. ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలందరూ సంతోషంగా ఆనందంగా ఉండాలని ఆరోగ్యకర జీవనం గడపాలని ఆమె సూచించారు. ప్రభుత్వం క్రీడలు క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని ఆమె చెప్పారు. ప్రజలందరూ ఆనందంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని వివరించారు. సభ్యులు పెనుమజ్జి విజయలక్ష్మి, పెద్ది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

## ఏ సమస్య ఉన్నా తెలియజేయండి : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సాలూరు (చైతన్యరథం): గర్భంతో ఉన్న మహిళ గర్భగుడిలో ఉన్న దేవతతో సమానం అని.. గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతిగృహంతో ఉన్న గర్భిణులకు ఏ సమస్య వచ్చినా తనకు తెలియజేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని వైటీసీలో గల గర్భిణుల వసతి గృహాన్ని ఆమె పరిశీలించారు. గర్భిణుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మినరల్ వాటర్ క్యాన్‌లతో నీటిని తీసుకుని వెళ్లి వారికి అందజేశారు. పాడైన ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. వసతి గృహంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తక్షణం తన దృష్టికి తీసుకుని రావాలని ఆధికారులకు ఆదేశించారు. గర్భిణులు ప్రసవం అయి ఇంటికి వెళ్లే వరకు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. తమకు జీతాలు సరిగ్గా అందడం లేదని సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నాతాధికారులతో మాట్లాడి జీతాలు త్వరలో జమ అయ్యేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆమె వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి, వైటీసీ మేనేజర్ విద్యాసాగర్, టీడీపీ నాయకులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్ ఉన్నారు.

# అరకు ఉత్సవ్ కోసం భారీగా నిధుల విడుదల

అరకు (చైతన్యరథం): అరకు వెళ్లే పర్యాటకులకు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చలికాలంలో మంచు దుప్పటి కప్పుకున్న ప్రకృతి అందాలను చూడటానికి పర్యాటకులు ఎక్కడెక్కడి నుంచో వస్తుంటారు. శీతాకాలంలో అరకు లోయ అందాలు కనువిందు చూస్తుంటాయి. అయితే వీటిని చూసి సందర్శకులు మైమరిచిపోతుంటారు. అలాంటి వారి కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల తర్వాత మళ్లీ అరకు ఉత్సవ్ నిర్వహించడానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అరకు ఉత్సవ్ 2025 పేరిట ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాట్లు చేపట్టింది. అరకులో గిరిజన పండుగ చలి నిర్వహణ కోసం రూ.కోటి మంజూరు చేస్తూ పర్యాటక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 తేదీ వరకూ అరకు గిరిజన పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. అరకులో చలి పండుగతో పాటు ఫిబ్రవరి 23 తేదీ నుంచి 25 తేదీ వరకూ మారేడుమిల్లిలో పర్యాటక కార్యక్రమాలు నిర్వహించేందుకు అల్లూరి జిల్లా కలెక్టర్ అనుమతి కోరారు. ఈ మేరకు అరకు గిరిజన పండుగ నిర్వహించేందుకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసింది. పులికాట్ సరస్సుకు వచ్చే ఫ్లెమింగో పక్షుల సందర్శన కోసం ప్రతి ఏడాది నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్ కోసం కూడా రూ.కోటి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 31 నుంచి 3 రోజులపాటు అరకులో చలి పండుగ జరగనుంది. దీనికి సంబంధించి చలి ఉత్సవం పేరుతో ప్రభుత్వం పోస్టర్లు విడుదల చేసింది. జిల్లా కలెక్టర్, అధికారులు. పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ అరకు లోయకు చేరుకుని చలి పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. దేశంలోని గిరిజనుల సాంప్రదాయాలు, ఆచారాలను ఉత్సవాల ప్రాంగణంలో ప్రదర్శించేందుకు అనుమతిచ్చారు. స్టాల్స్ ఏర్పాటు చేయడానికి పలు స్థలాలను కేటాయించారు. జనవరి31న ఈ చలి పండుగకు ముందు, మారథాన్, స్పోర్ట్స్ ఈవెంట్‌లు.. పెయింటింగ్, రంగోలిలో పోటీలు కూడా నిర్వహించేలా ప్రభుత్వం రూపకల్పన చేపట్టింది.

## 20 లక్షల ఉద్యోగాల కల్పనకు సీఎం చంద్రబాబు శ్రమిస్తున్నారు : గొండు శంకర్



శ్రీకాకుళం (చైతన్యరథం): యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌లు రేయింబవళ్లు శ్రమిస్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సోమవారం స్థానిక 80 అడుగుల రోడ్డులో గల జిల్లాపార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ వరల్డ్‌ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏపీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు. ఐదేళ్లు వైసీపీ అరాచకపాలన సాగించిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో, ఏఐలో దేశంలోనే నెంబర్‌వన్ నిలబెట్టేందుకు సీఎం కష్టపడు తున్నా రన్నారు. సీఎం చంద్రబాబు, లోకేష్‌కు పారిశ్రామిక వేత్తలు ఎర్రతివాచీ పరిచారని తెలిపారు.

## 20 లక్షల ఉద్యోగాల కల్పనకు సీఎం చంద్రబాబు శ్రమిస్తున్నారు : గొండు శంకర్

శ్రీకాకుళం (చైతన్యరథం): టీడీపీ వ్యవ స్థాపకుడు దివంగత నంద మూరితారకరామారావు తెలు గుప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. సోమవారం సన్యాసిపుట్టుగలో ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నియో జకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుద్దాల నిర్మలారెడ్డి, కూటమి నాయకులు ఢిల్లీరావు, పద్మనాభం, చంద్రశేఖర్,కామేష్ పాల్గొన్నారు.



## 20లక్షల ఉద్యోగ కల్పన లక్ష్యంగా ఏపీ రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం

### : రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వెల్లడి



అరకు (చైతన్యరథం):కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా తీర్చిద్దిడమే లక్ష్యంగా పనిచేస్తుందని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. అరకులో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమాన్ని గాలికొదిలేసిందని, జగన్ ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు బయపడేవారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశలు కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బృందం దావోస్‌లో పర్యటించి రాష్ట్రానికి పెట్టుబడులు సాధించారని అన్నారు. 2014లో రాష్ట్ర విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కాపాడేందుకు విశాఖపట్నంలో మూడుసార్లు రాష్టంలో పారిశ్రామిక పెట్టుబడుల కొరకు మూడుసార్లు సదస్సులు నిర్వహించడం జరిగిందని, దావోస్, దక్షిణకొరియ దేశంలో పర్యటించి అన్నిరంగాల్లో కలిపి 11.77 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చి బ్రాండ్ ఏపీగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పారిశ్రామిక పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రానికి వచేవారు కాదని, దోచుకోవడమే లక్ష్యంగా వైసీపీ పాలన సాగిందన్నారు. రాష్ట్రానికి 5లక్షల కోట్లకుపైగా పెట్టుబడులతో సుమారు 50కంపెనీలు రాష్టంలో వచ్చాయని, దీనివల్ల 40వేల ఉద్యోగ అవకాశాలు లభించాయని, ఇది కేవలం విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడికే సాధ్యమని ఒక జూమ్‌కాల్‌తోనే ఆరసలర్ మిట్టల్ నిప్పన్ స్టిల్ కంపెనీతోనే మాట్లాడి రాష్ట్రనికి 1.46లక్షల కోట్లు పెట్టుబడులను తీసుకొచ్చిన ఘనత నారా లోకేష్‌దేనన్నారు. జనవరి 8న విశాఖలో 2లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్ట్‌లకు ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసారని రాష్ట్రంలో ఉన్న మేధావులు విద్యావంతులు నిరుద్యోగులు రైతులు కోరిక మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిందని కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి చెందుతుందాని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌తో పాటు టీడీపీ నాయకులు బిడ్డ లక్ష్మణ్ శ్యామ్ దుంబేరీ శ్యామ్ ఆనంద్ తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగుల ఆశాదీపం సీఎం చంద్రబాబు



శ్రీకాకుళం (చైతన్యరథం): రాష్ట్రంలో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపే ఆశా దీపం సీఎం చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెట్టుబడిదారులు పరిశ్రమలు ఏర్పాటుకు వస్తున్నారన్నారు. దావోస్ పర్యటనలో లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు బహుళజాతి కంపెనీలు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, నేతలు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, బైరి భాస్కరరావు, బలగ భారతి పాల్గొన్నారు.

## చంద్రబాబు కృషితో పరిశ్రమలు : శిరీష



పలాస (చైతన్యరథం): సీఎం చంద్రబాబునాయుడు ముందుచూపు, మంత్రి లోకేశ్ కృషి ఫలితంగా రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు పెట్టుబడిదారులు వస్తున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పరిశ్ర మలతో నూతన వెలుగులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు దావోస్ వెళ్లి 20 లక్షల ఉద్యోగాల కల్పనకు సంబంధించిన పరిశ్రమలు, సంస్థలను రాష్ట్రానికి తీసుకు రావడం హర్షణీయమన్నారు. ఒక్క రాష్ట్రానికి రూ. 1.46 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకు రావడం చరిత్రలో మిగిలిపోతుందన్నారు.

# అప్పులపాలైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం

- ఏడాదిపాటు ఇబ్బందులుంటాయని ముందే ఊహించాం
- దావోస్ పర్యటనతో పెట్టుబడులు, ఉద్యోగాలకు ఆస్కారం
- వైసీపీ హయాంలో పెట్టుబడిదారులు పారిపోయారు
- అభివృద్ధి, సంక్షేమం ఎన్డీయే కూటమి రెండుకళ్ళు
- ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేస్తాం ఎమ్మెల్యే గోరంట్ల



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాష్ట్రంలో వైసీపీ హయాంలో అనుసరించిన అస్తవ్యస్త విధానాలతో అప్పులపాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందోనని టీడిపి సీనియర్ నేత, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారు. గడిచిన ఐదేళ్లలో కుంటుపడిన అభివృద్ధిని మళ్ళీ పట్టాలెక్కిస్తు న్నామన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మంగళవారం ఉదయం ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ టీమ్ జరిపిన దావోస్ పర్యటనతో ఆరు లక్షల కోట్ల పెట్టుబడులు, నాలుగు లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. పదవి కోల్పోయినా వైసీపీ తమ సోషల్ మీడియా ద్వారా కూటమిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని గోరంట్ల విమర్శించారు. జగన్ పాలనలో పెట్టుబడులు వెనక్కు పోయాయని, పారిశ్రామిక విధానం విచ్చినం చేసేశారని, ఫలితంగా పెట్టుబడిదారులు పారిపోయారని ఆయన మండిపడ్డారు. విశాఖ , రాయలసీమ కేంద్రాలుగా కూటమి ప్రభుత్వంలో పెట్టుబడులు రాబోతున్నాయని, ప్రతిజిల్లాను ఒక యూనిట్‌గా పరిశ్రమలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు.

**ఏడాదిపాటు ఇబ్బందులుంటాయని ముందే ఊహించాం**

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసి, అన్ని రంగాలను దెబ్బతీయడం వలన సరిచేయడానికి ఏడాది సమయం పడుతుందని ముందే ఊహించామని గోరంట్ల అన్నారు. చేసిన అప్పులపై వడ్డీలు కట్టడానికి, బకాయిలు తీర్చడానికే నిధులన్నీ సరిపోతున్నాయని అయన చెప్పారు. అయినప్పటికీ ఒక్కొక్కటి ప్రభుత్వం చేసుకు వస్తోందని, ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేస్తామని అయన స్పష్టం చేసారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఫీజురీయంబర్స్‌మెంట్ వంటివన్నీ ఒక్కొక్కటి అమలు చేస్తామమని గోరంట్ల చెప్పారు. వచ్చే బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆయన సూచించారు. అభివృద్ధి సంక్షేమం రెండుకళ్లుగా భావించి ప్రణాళికా బద్ధంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో మల్టీ లెవెల్ అభివృద్ధి దిశగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని గోరంట్ల తెలిపారు. కేంద్రం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకుని అన్ని పనులు ప్రణాళికాబద్ధంగా చేస్తున్నట్లు గోరంట్ల చెప్పారు. వైసిపి హయాంలో నిర్లక్ష్యం చేసియాన్ రోడ్లు ఇప్పుడు వేగంగా వేస్తున్నామని ఆయన చెప్పారు.

**పార్టీ మారినాసరే తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు**

డబ్బుంటే పార్టీలు మారితే చాలు అనుకునే వాళ్ళనీ మేము సహించబోమని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని ఒక ప్రశ్నకు సమాధానంగా గోరంట్ల పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి విశాఖ కేంద్రంలో వేల ఎకరాలు దోచుకుని, కోట్లాది రూపాయలు దోపిడీ చేసారని, అప్పుడూ ఇప్పుడూ కూడా ఆయన ఏ-2 అనే సంగతి మరిచిపోతే ఎలాగని ఆయన చురకలంటించారు. ప్రతిపక్షంలో ఉండే కేసులు పెట్టకుండా ఏడిపించడం ఉన్నవాళ్లు వస్తే పర్వాలేదు... కేసులు పెట్టి రౌడీయిజం చేసే వాళ్ళు మాకొద్దు అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రెండేళ్లలో వైసీపీ జగన్మోహన్ రెడ్డి నిలబెట్టలేడని ఆయన విశ్లేషించారు. పార్టీకోసం కష్టపడి అంకితభావంతో పనిచేసిన నాయకుల్ని కార్యకర్తలను ప్రోత్సహించాలని, వైసీపీ హయాంలో ఎన్నో ఒడిదుకులు ఇబ్బందులు ఎదుర్కొని పనిచేసినవార్ని గుర్తించాల్సి ఉందని ఆయన స్పష్టంచేశారు..డయాఫ్రమ్ వాల్ అంటే తెలియనివాడు ఇరిగేషన్ మంత్రి చేసిన వ్యక్తి అంబటి... వీరి అసమర్థత వల్ల డయా ఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందని మరో ప్రశ్నకు సమాధానంగా గోరంట్ల వ్యాఖ్యానించారు.

పంచాయితీలు మర్జింగ్ విషయంలో ఇబ్బందులు ఉన్నాయి. రూరల్‌లో కొన్ని సిటీలో కలిసిపోయాయి, కోర్టు కేసులు క్లియర్ చేసి, ఎన్నికలు పెట్టాలని గోరంట్ల వ్యాఖ్యానించారు. 12 ఏళ్ల నుండి మేయర్ మున్సిపల్ ఎన్నికలు జరగక పోవడం మామూలు విషయం కాదని అన్నారు. మేయర్ సీటుని అందరూ ఆశించడం సహజమని అయితే పార్టీలన్నీ కూర్చుని నిర్ణయం చేస్తాయని అన్నారు. రాజమండ్రి సీటు మీద.. రూరల్ పైన నాకు మంచి పట్టు ఉందని, బుచ్చయ్య చౌదరిని ఎవరు ఏమార్చలేరని ఆయన అన్నారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, రూరల్ మండలం టీడీపీ అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మార్ని వాసుదేవ్ సమావేశంలో పాల్గొన్నారు.

# అభివృద్ధి విషయంలో ఒక అడుగు ముందే ఉంటాం

రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగర అభివృద్ధి విషయంలో తాము ఒక అడుగు ముందే ఉంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పేర్కొన్నారు. స్థానిక 2, 4 డివిజన్లకు సంబంధించి జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణం పనులను టీఎన్టియూసి జిల్లా మాజీ అధ్యక్షులు నక్కా చిట్టిబాబు, నగర టీడీపీ ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకీ రామయ్య తదితర నాయకులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ చాలా ఏళ్ళుగా సదరు డివిజన్లో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానిక ప్రజలు పడుతున్న అవస్థలను తాము గుర్తించామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నగర పాలక సంస్థ అధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అభివృద్దే ప్రధానంగా తమ కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రానున్న పుష్కరాల నేపధ్యంలో పుష్కరాలకు ముందు... పుష్కరాలకు తరువాత అనే రీతిలో రాజమండ్రి రూపు రేఖలు మారనున్నాయన్నారు. నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. స్థానిక నాయకులు సలాది ఆనంద్, బండారు శ్రీను, నగర పాలక సంస్థ అధికారులు ఆయన వెంట ఉన్నారు.



# అంతిమంగా ప్రజలకు లబ్ది చేకూర్చడమే మా లక్ష్యం



గుంటూరు (చైతన్యరథం): సీసీఆర్సీ కార్డులు ఇచ్చిన వారందరికీ రుణాలు మంజూరు చేసేలా నియోజకవర్గంవారీగా డ్రైవ్ చేపట్టాలని, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిని ఉక్కుపాదంతో అణచివేసేలా కేసులు నమోదు చేయాలని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, పర్యాటక, సాంస్కృతిక, సినియాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంపై మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 1.48 కోట్ల తెల్ల రేషన్ కార్డులు, 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయన్నారు. వీటిని అనుసంధానం చేయకపోవడం వల్ల 8 లక్షల గ్యాస్ కనెక్షన్‌లు అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వచ్చే వారంలో గ్రామ, వార్డు సచివాలయాలకు ఈ బాధ్యత అప్పగించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో 87 లక్షల పైచిలుకు గ్యాస్ సిలిండర్‌లు లబ్ధిదారులకు అందించామన్నారు. గుంటూరు జిల్లాలో 3.83 లక్షల ఉచిత గ్యాస్ సిలిండర్‌లు పంపిణీ చేశామన్నారు.

అంతిమంగా ఎక్కువ మంది వినియోగదారులకు లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రేషన్ వాహనాల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటినిమరింత సమర్దవంతంగా ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై చర్చిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసి జిల్లాను అన్నిరంగాలలో సర్వతోముఖాభివృద్దిగా చేసి అగ్రగామిగా నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలసి పనిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మరియు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, శాసనమండలి సభ్యులు కె.ఎస్ లక్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, టి. కల్పలతారెడ్డి, మురుగుడు హనుమంతరావు, శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు, ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ కుమార్, గల్లా మాధవి, మహమ్మద్ నసీర్ అహ్మద్, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా అధికారులు పాల్గొన్నారు.

# ఆర్థిక విచ్ఛిన్నం చేసిన జగన్ సర్కార్ : ఎం. ధారునాయక్



అమరావతి (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ ఆరాచక, విధ్వంసకర ఆర్థిక విధానాలతో రాష్ట్రాన్ని ఏవిధంగా అప్పుల విష వలయంలోకి తోసేసిందో చెప్పేందుకు 18 పెద్ద రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిపై నీతిఆయోగ్ విడుదల చేసిన నివేదికనే నిదర్శనమని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం. ధారునాయక్ వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక విచ్ఛిన్నం చేశారని, నీతి ఆయోగ్ రూపొందించిన 'ఆర్థిక ఆరోగ్య సూచి నివేదిక-2025' నిదర్శనమన్నారు. గత వైసీపీ పాలన ఐదేళ్లలో ఏడాపెడా రూ.లక్షల కోట్ల అప్పులు చేసిన జగన్ ప్రభుత్వం... మూలధన వ్యయంపై అతితక్కువ ఖర్చు పెట్టడం ద్వారా, రాష్ట్రాన్ని ఆర్థిక ఆగాధంలోకి నెట్టేసిందని నీతి ఆయోగ్ పేర్కొందన్నారు. ఒక్క 2022-23లో రుణంగా తెచ్చిన రూ.67,885 కోట్లతో (బడ్జెటేతర అప్పులు అదనం) కలిపి రూ.2.25 లక్షల కోట్లు ఖర్చు పెడితే.. దానిలో మూలధన వ్యయం రూ.7244 కోట్లు (3.2%)మాత్రమేనన్నారు. 'విధాన నిర్ణయాలు చేసేవారు. పాలకులు.. అసమర్థులు, అవినీతిపరులు, పరిపాలన తెలియనివారు అయితే ప్రజలంతా ఇబ్బంది పడతారు. జగన్ ప్రభుత్వం నిర్వాకం వల్ల ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ఒకప్పుడు వెనకబడిన రాష్ట్రంగా పిలిచే ఒడిశా 2022 - 2023 సంవత్సరానికి ఆర్థిక ఆరోగ్య సూచీలో మొదటి స్థానాన్ని దక్కించుకుంటే ఏపీ 17వ స్థానం (చివరి నుంచి రెండోవ స్థానంలో)లో నిలిచింది. నా ఎస్సీ,ఎస్టీలను ఉదరిగొట్టే ఉపన్యాసాలు ఇచ్చే జగన్ ప్రభుత్వం... వారికి ఆస్పత్రులు, పాఠశాలలు, హాస్టల్ భవనాల నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టిన దాఖలు లేవు. గత వైసీపీ ప్రభుత్వం విధ్వంసకర విధానాలు, అవినీతితో రాష్ట్ర ఆదాయం పడిపోయింది. గత వైసీపీ ప్రభుత్వం తహసిల్దారు కార్యాలయం సహా వివిధ ప్రభుత్వ ఆస్తుల్ని, మద్యంపై భవిష్యత్తులో వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి దొరికిన చోటల్లా అప్పులు చేసి దుబారా ఖర్చులు చేసి వైసీపీ ప్రభుతం నాశనం చేసిందని ఎం.ధారునాయక్ విమర్శించారు.

# సీఎం తణుకు పర్యటనలో స్వల్ప మార్పు

భీమవరం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ముందుగా సీఎం ఫిబ్రవరి 1న తణుకులో పర్యటిస్తారన్న సమాచారంతో ఎస్ఎస్వీఎం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు పనులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి జేసీ రాహుల్కుమార్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. ఆఖరి నిమిషంలో ఈ నెల 31న పెనుగొండలోని వాసవీమాత దర్శనానికి ముఖ్యమంత్రి రానున్నారని తెలిసింది. అమ్మవారి ఆత్మార్పణ ఉత్సవంలో భాగంగా పట్టువస్త్రాలు సమర్పించి, హోమ క్రతువులో పాల్గొంటారన్న సమాచారంతో జేసీ రాహుల్ కుమార్రెడ్డి, ఎస్పీ నయీం అస్మి తదితరులు పెనుగొండ ఏఎంసీలో హెలిప్యాడ్ ప్రాంతాన్ని, నగరేశ్వర, మహిషాసురమర్దని, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్ని వాసవీశాంతిధాంను పరిశీలించారు. తణుకు పర్యటన రద్దయ్యిందని చెబుతున్నారు. కాగా సీఎం పర్యటనపై స్పష్టత రావాల్సి ఉందని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు.



# నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని అమలు చేస్తున్నా

- గన్నవరం రోటరీ క్లబ్‌లో జరిగిన జాబ్ మేళాలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



గన్నవరం (చైతన్యరథం): ఎన్నికల ముందు చెప్పిన విధంగా నియోజకవర్గంలోని 15000 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తానన్నా హామీని నిలబెట్టుకుంటున్నానని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. మంగళవారం గన్నవరం రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ మేళా లో పాల్గొనేందుకు నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. అమర్ రాజా గ్రూప్ 1000 ఉద్యోగాలు, ఎం. గ్రూప్ 100 ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. ఇంటర్వ్యూలో అర్హత సాధించి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామకపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ గత నెల రోజుల క్రితం జాబ్ మేళా నిర్వహించి 1535 మందికి నాన్ ఐటీ, 72 మందికి ఐటీ ఉద్యోగాలు కల్పించానని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ముందు చెప్పిన విధం గా 15000 మందికి ఉద్యోగాలు కల్పిస్తాను అని మాట ఇచ్చానని అదే మాట ప్రకారం పని చేస్తున్నాని చెప్పారు. సూపర్ సిక్స్ లో భాగం గా గన్నవరం నియోజకవర్గానికి ఇచ్చిన హామీల్లో ఒక హామీ అయిన మల్లవల్లి హామీ నీ ఇప్పటికే అమలు చేశా అని భావిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పరిశ్రమలు తెచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నాని దాదాపు 420 కంపెనీలు మల్లవల్లికి రానున్నాయని వెల్లడించారు. మల్లవల్లి పారిశ్రామికవాడ రాష్ట్రానికి తలమానికం కానుందని చెప్పారు. కెడిసిసి బ్యాంక్ చరిత్రలో నాకు ఎప్పటికీ ఒక పేజీ ఉంటుందన్నారు. గత పాలకుల పాలన శాపం కారణంగా రాష్ట్రం అభివృద్ధి లో వెనకపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రహ్మ లింగయ్య చెరువులో మట్టి తవ్విన పాపం ఊరికే పోదని హెచ్చరించారు.

పోలవరం కెనాల్ ను ఏలూరు క్యానల్ కు అనుసందం చేస్తానని ఏలూరు కెనాల్‌పై పై వంతెనలు నిర్మిస్తా అని హామీ ఇచ్చానని ఇచ్చిన హామీలకు అనుగుణంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న గన్నవరం నియోజకవర్గంలో అతిథి గృహం, కానీ కాన్ఫరెన్స్ హాల్ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత శాసనసభ్యుడు తన కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రినీ కూడా బాగుచేయలేకపోయాడని విమర్శించారు. నియోజకవర్గంలోని పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తా అని హామీ ఇచ్చానని అన్ని హామీలు అమలు చేస్తానని స్పష్టం చేశారు. అశోక్ లే లాండ్ ను వెనక్కి తీసుకువచ్చింది తానే అని వెల్లడించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయటమే తన అజెండా అని ప్రతి ఒక్కరూ తనకు సహకరించాలని కోరారు.

# లోకేష్ సహకారంతో 80 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు

మంగళగిరి (చైతన్యరథం): మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి టౌన్, రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 80 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. 68 వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళలు కుట్టుమిషన్లు అందజేశారు. కుట్టు మిషన్లు అందుకున్న లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# 2లక్షల ఇళ్లకు సూర్యఘర్ కనెక్షన్స్ అందించటమే ధ్యేయం

◆సూర్యఘర్ పథకంపై విజయవాడ పటమట సెంటర్‌లో అవగాహన ర్యాలీ

◆పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ

◆పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు




విజయవాడ (చైతన్యరథం): ప్రజలకు విద్యుత్ బిల్లుల చెల్లింపుల భారం తగ్గించేందుకు అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని ప్రతి ఇంటిని సూర్యఘర్ వెలుగులతో నింపి హరివిల్లు చేసుకోవాలి. సోలార్ ప్యానెల్ కనెక్షన్‌ల కొరకు ప్రజలకు అవగాహన పెంచేందుకు ముందుగా జిల్లా అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు తక్షణమే పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపి కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో 2లక్షల ఇళ్లకు సూర్యఘర్ కనెక్షన్స్ అందించటమే ధ్యేయంగా పెట్టుకున్నట్లు ఎంపి కేశినేని శివనాథ్ చెప్పారు. సూర్యఘర్ పథకంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీని మంగళవారం ఎంపి కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశలు పటమట ఎన్‌టిఆర్ సర్కిల్ నుండి ప్రారంభించి గురునానక్ కాలనీ వరకు ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గురునానక్ నగర్‌లో సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను అమర్చుకున్న మన్న నాగ భాస్కరాంబ గృహనికి వెళ్ళి ఇంటి కప్పుపై సోలార్ ప్యానెల్‌ను పరిశీలించారు. సోలార్ ప్యానెల్ ద్వారా విద్యుత్ తయారి వినియోగం వివరాలను అడిగి తెలసుకుని లబ్దిదారురాలు మన్న నాగ భాస్కరాంబను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ప్రజలకు విద్యుత్ చెల్లింపుల బారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. అతి తక్కువ ఖర్చుతో లబ్దిదారులు ఇంటి పై సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తయారైన విద్యుత్‌ను ఉచితంగా గృహ అవసరాలకు వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపులు చెల్లించవలసిన అవసరం ఉండదన్నారు. తద్వారా ఎంతో ఆర్థిక ప్రయోజనంపొందగలుగుతారన్నారు. లబ్దిదారులు రూ.2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ.78వేల ప్రభుత్వ రాయితీతో ఇంటి కప్పుపై ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకోవలసి ఉంటుందన్నారు. రూ.2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ.78 వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రాయితీ మినహా మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందొచ్చన్నారు. దాదాపు 20 ఏళ్లపాటు ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందొచ్చని వివరించారు. 3 కేవీ వ్యవస్థ ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చని.. మన అవసరాలకు సరిపడా మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందవచ్చునని ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హెచ్‌యం ధ్యానచంద్ర, ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, టీడీపీ రాష్ట్ర నాయకులు చెన్నుపాటి గాంధీ, బొప్పన భవకుమార్, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు ఆషా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబం సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి : వసంతకృష్ణ ప్రసాద్




మైలవరం (చైతన్యరథం): ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన పీఎం సూర్యఘర్ యోజన కింద ప్రతి ఇంటినీ సోలార్ ద్వారా విద్యుత్ వినియోగానికి అనుసంధానించేందుకు అడుగులు వేస్తోంది. భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు, ఆర్థిక స్వావలంబనకు ఉపయోగపడుతున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు. జి.కొండూరులోని పీఎం సూర్యఘర్ యోజన పథకం గురించి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. జి.కొండూరులో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడలి నుంచి పులివాగు వంతెన వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ... పర్యావరణానికి తద్వారా ఆరోగ్యకర జీవితానికి మేలుచేసే పునరుత్పాదక ఇంధన వినియోగం దిశగా ప్రతిఒక్కరూ వెళ్లి, సౌర విద్యుత్‌ను ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూర్య ఘర్ పథకంపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఈ పథకం 2024, ఫిబ్రవరి 15న ప్రారంభమైందన్నారు. ఇంటి పైకప్పుపై రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. సొంత ఇల్లు ఉండి, కరెంట్ కనెక్షన్ ఉన్నవారెవరైనా www.pmsuryaghar.gov.in ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. మైలవరం నియోజకవర్గానికి 15వేల ఇళ్లకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

**కేటగిరీని బట్టి రాయితీ**

పీఎం సూర్య ఘర్ యోజన గృహ విని యోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. దీని కింద 3 రకాల సామర్థ్యంతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం ఉన్న రూఫ్టప్ ఏర్పాటు వ్యయం రూ.1.95 లక్షలు కాగా, రాయితీ రూ.78 వేలు వస్తుంది. రెండు కిలోవాట్లయితే రూ.1.40 లక్షలు కాగా రాయితీ రూ.60 వేలు వర్తిస్తుంది. ఒక కిలో వాట్ వ్యయం రూ.70 వేలు కాగా రూ.30 వేల రాయితీ లభిస్తుంది. లబ్ధిదారులు వారి ఇంటి విద్యుత్ వినియోగాన్ని బట్టి రూఫ్ టాప్ సామర్థ్యాన్ని ఎంపిక చేసుకోవచ్చు. లబ్ధిదారు వాటా 10 శాతం పోనూ, మిగతా మొత్తాన్ని 7% వడ్డీపై బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించే బాధ్యతను అధికారులు చేపట్టారు. ఒకవేళ లబ్ధిదారు 10 శాతం వాటా కూడా చెల్లించలేని స్థితిలో ఉంటే, ఆ మొత్తాన్ని బ్యాంకు, స్త్రీనిధి, పొదుపు మొత్తం నుంచి అందించనున్నారని శాసనసభ్యులు కృష్ణప్రసాదు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నూతులపాటి బాల కోటేశ్వరరావు (బాల), ఎన్డీయే కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ ఆరోగ్యం అనేది టీడీపీ లక్ష్యం

విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలోని అందరికీ ఆరోగ్యం అనేది తమ కూటమి ప్రభుత్వ లక్ష్యంగా అడుగులు వేస్తోందని తూర్పు నియోజవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 7వ డివిజన్‌కు చెందిన సీఆర్ నగర్‌కు చెందిన రంగాల సాయిబాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల 90 వేల ఎల్‌వోసీ పత్రాన్ని, 6వ డివిజన్‌కు చెందిన నందిగామ నవ్యశ్రీకి ఆసుపత్రిలో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.50 వేల ఎల్‌వోసీ పత్రాన్ని లబ్ధిదారులకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ స్వయంగా అందజేశారు. వీటితో పాటుగా 2వ డివిజన్‌కు చెందిన నాళం ఫణి మాధవ్‌కు కళాశాల ఫీజు నిమిత్తం రూ.15 వేల రూపాయలను ఎమెల్యే గద్దె రామమోహన్ తన సొంత నిధుల నుంచి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే కాకుండా రాష్ట్రంలోని ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని తెలిపారు. అందువల్లనే అనారోగ్యానికి గురైన పేదలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యానికి అయిన ఖర్చులను మంజూరు చేస్తున్నారని చెప్పారు.



# గొంతు చించుకోకండి.. గుర్తు తెచ్చుకోండి

## అవినీతి పుట్ట మీరు.. మీ అక్రమాలు కోకొల్లలు

**మంత్రి నారాయణను విమర్శించే స్థాయి ఇద్దరికీ లేదు - మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ సీసీకి నుడా చైర్మన్ కోటంరెడ్డి కౌంటర్**



నెల్లూరు, (చైతన్యరథం) : వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ విధ్వంసకర పాలనలో వేల మంది టీడీపీ నేతల ప్రాణాలు తీశారని, అస్తులను ధ్వంసం చేశారని ఆరోపించారు. తాము విధ్వంసాలు మొదలెడితే వైసీపీ మూకలు తట్టులేవన్నారు. కానీ తమ సిద్ధాంతం అది కాదన్నారు.తాము ఎవ్వరికీ వ్యతిరేకం కాదని, రాజకీయ వేధింపులు తమకు చేతకాదని స్పష్టం చేశారు. వైసీపీ నేత బాలకృష్ణకు చెందిన అక్రమ కట్టడాన్ని కూల్చేస్తే గొంతు చించుకుని మాట్లాడడంపై విరుచుకుపడ్డారు. కోట్ల రూపాయల విలువ చేసే కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి బిల్డింగ్ కట్టడాన్ని సమర్ధించడం కాకాణి, సీసీ దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు కార్పొరేషన్ అధికారులు కూల్చేశారని, అందులో ఎవరి ప్రమేయం లేదని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి స్పష్టం చేశారు. కోర్టు ఉత్తర్వుల గురించి తెలుసుకోకుండా మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి గొంతు చించుకుని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంత్రి నారాయణ మీద విమర్శలు చేసే స్తాయి కాకాణికి లేదన్నారు. రాక్షస పాలనకు వైసీపీ చిరునామా అని ఎద్దేవా చేశారు. విధ్వంసం వారి సిద్దాంతమని పేర్కొన్నారు. కాలువ పోరంబోకు స్థలంలో వైసీపీ నేతలు ఇళ్లు కట్టడితే ప్రభుత్వం ఊరుకుంటుందా..? అని ఆయన ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు కూల్చేస్తే..అధికారులను బెదిరిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.. వైసీపీ అధికారంలోకి వస్తుందని కాకాణి పగటికలలు కంటున్నారన్నారు.

**కాకాణి అరాచకాలు సర్వేపల్లికి ఎరుక**

మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి చేసిన అరాచకాలు సర్వేపల్లి నియోజకవర్గం మొత్తం తెలుసని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు.. బీసీనేతల రొయ్యలగుంటల విధ్వంసం చెయ్యడం, అక్రమ కేసులు పెట్టడం ఇంకా ప్రజలు మరిచిపోలేదన్నారు. నీతిమంతుడు లాగా కాకాణి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దళితుడు ఉదయగిరి నారాయణ్ణి పోలీసులు చంపేస్తే, అతనికి న్యాయం చేయకుండా.. పోలీసుల్ని కాపాడిన నీచ చరిత్ర కాకానిది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. తాము విధ్వంసం చెయ్యడం మొదలు పెడితే ఒక్కరు కూడా రోడ్డుమీద తిరగలేరని హెచ్చరించారు. కానీ తాము అలా చెయ్యడం లేదని కోటంరెడ్డి వెల్లడించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పోలీసులను అడ్డంపెట్టుకుని మంత్రి నారాయణతో పాటు.. ఆయన కుటుంబాన్ని వేధించలేదా అని ప్రశ్నించారు. మంత్రి నారాయణను విమర్శించే స్తాయి చంద్రశేఖర్ రెడ్డికి లేదని కోటంరెడ్డి వ్యాఖ్యనించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మామిడాల మధు, ఉచ్చిభూవానేవార్ ప్రసాద్, అంచురి శ్రీనివాసులు నాయుడు, జహీర్, కోకు మహేంద్ర రెడ్డి, ఆకుల హనుమంత్ రావ్, తంబీ సుజన్ కుమార్,పెనుబర్తి సాయి, పిరిగల నవీన్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

# మా జిల్లా సమస్యలను పరిష్కరించండి

**- ఇరిగేషన్ మంత్రి నిమ్మలను కలిసిన ఎంపీ వేమిరెడ్డి**

**- కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చ**



నెల్లూరు, (చైతన్యరథం) : నెల్లూరు జిల్లాలోని పలు నీటిపారుదల సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిమ్మల రామానాయుడుతో ఎంపీ వేమిరెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇరిగేషన్‌కు సంబంధించి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధిపై ఆయనతో మాట్లాడారు. కనిగిరి రిజర్వాయర్ ఆధునికీకరణ ప్రాధాన్యతను మంత్రికి వివరించారు. పలు పెండింగ్ ప్రాజెక్టుల పనుల విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై సానుకూలంగా స్పందించిన మంత్రి నిమ్మల నెల్లూరు జిల్లాలో నెలకొన్న నీటి పారుదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# పరిశ్రమల స్థాపనకు స్వర్గధామం ఏపీ

**- తిరుపతి టీడీపీ ఇన్‌ఛార్జి మల్లూరు సుగుణమ్మ**



తిరుపతి, (చైతన్యరథం): సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతం అయిందని తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మల్లూరు సుగుణమ్మ పేర్కొన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫారం పదస్సులో ప్రత్యేక ఆకర్షణగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. మంగళవారం తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్ రెడ్డి నిర్వాకానికి అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామిక రంగానికి నూతన వెలుగులు తీసుకురావడం కోసం తండ్రీ తనయులు చేయింబవళ్ళు కష్టపడుతున్నారన్నారు. నాడు తెలుగు ప్రజలకు మొదటిసారి ఐటీని పరిచయం చేసి తెలుగువాడి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన చంద్రబాబు నేడు ఏఐ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో భేటీ అయ్యారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేష్ పడిన శ్రమ సత్ఫలితాలిస్తున్నాయన్నారు. భేటీ అయిన ప్రతీ పారిశ్రామికవేత్త తమ ఎగ్జిక్యూటివ్ మెంబర్లతో చర్చించి తప్పకుండా రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెడతామిన సానుకూలంగా స్పందించారు. కానీ జగన్ రెడ్డిలా చేతకాని ప్రభుత్వంలో దావోస్ వెళ్ళకుండా ఇంట్లో కూర్చొని పబ్జీ ఆడుకోలేదన్నారు. 2014లో విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడేందుకు విశాఖలో 3 సార్లు పెట్టుబడుల సదస్సును నిర్వహించి, దావోస్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో పర్యటించి అన్ని రంగాల్లో కలిపి రూ.11.77 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి ఏపీని బ్రాండ్ ఏపీగా తీర్చిద్దామన్నారు. 2019లో వైసీపీ వచ్చాక 'బ్రాండ్ ఏపీ'గా ఉన్న మన రాష్ట్రాన్ని 'బిల్డప్ ఏపీ'గా జగన్ రెడ్డి మారిస్తే తిరిగి సన్ రైజ్ ఏపీగా నేడు చంద్రబాబు మార్చారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులుతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్, రాష్ట్ర జిల్లా నగర, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



**నారా లోకేష్ ఆరోగ్య రక్ష ప్రారంభం**

# ఆరోగ్యశ్రీ లేకుంటే నేనున్నా

**- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**

నెల్లూరు, (చైతన్యరథం) : నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో 32, 33 డివిజన్లలో నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ అయిన తరువాత ఆరోగ్యశ్రీ వర్తించకుంటే హాస్పిటల్ యాజమాన్యం, దాతల సహకారంతో వారికి పూర్తి స్థాయిలో ఉచితంగా వైద్యం అందిస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హామీ ఇచ్చారు. భవిష్యత్తులో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని ఎక్కడికక్కడ స్థానిక నాయకుల, కార్యకర్తల సహకారంతో నిర్వహిస్తామన్నారు. నారా లోకేష్ ఆరోగ్యరక్ష కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సహకరిస్తున్న మెడికోవర్ హాస్పిటల్ యాజమాన్యానికి, డాక్టర్లు, సిబ్బందికి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమానికి అన్నీ తానై, అందరినీ సమన్వయం చేసుకొని ముందుకు నడిపిస్తున్న ఆరోగ్య రక్ష కార్యక్రమ కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య క్లస్టర్ ఇంచార్జిలు మన్నెం పెంచలనాయుడు, జలదంకి సుధాకర్, మన్నేపల్లి రఘు, 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్, 33వ డివిజన్ కార్పొరేటర్ కరణం మంజుల, బీజేపీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**సమస్యల తక్షణ పరిష్కారం కోసం**

# మన ఊరు, మన ఎమ్మెల్యే

**- మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**



మార్కాపురం, (చైతన్యరథం): మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంగళవారం పట్టణంలోని 7,8వ వార్డులలో మన ఊరు–మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో కలియతిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యంగా 7,8 వార్డులలో అర్హులకు వితంతు పెన్షన్లు రావడం లేదని కొందరు తన దృష్టికి తీసుకు వచ్చారని త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని అన్నారు. సాగర్ నీటి పైప్ లైన్లు లీకేజీలు అధికంగా ఉన్నాయని తన దృష్టికి మహిళలు తీసుకువచ్చారన్నారు. అక్కడక్కడ మురికి కాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయని అన్నారు. అక్కడక్కడ రోడ్లు అసంపూర్ణంగా ఉన్నాయ న్నారు. ఈ సమస్యలను రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు తక్షణమే స్పందించి రెండు, మూడు రోజుల్లో ఈ సమస్య పరిష్కరించాలని అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు కొత్త పెన్షన్లకు కొత్త రేషన్ కార్డులు కావాలని శాసనసభ్యులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# మూతపడ్డ లెదర్ పార్కును తెరిపిస్తాం

**- చందబాబు మేలు మరువలేం**

**- గిద్దలూరు పర్యటనలో ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ మాణిక్యాలరావు, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి**



మార్కాపురం, (చైతన్యరథం): మాదిగల అభివృద్ధి, లిడ్‌క్యాప్ లెదర్ పార్కుల సృష్టి ఘనత ఏపీ సీఎం నారా చంద్రబాబుకే దక్కుతుందని ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో మంగళవారం రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ మాణిక్యాలరావు, స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రాచర్ల మండలం, యడవల్లి సమీపంలో ఉన్న లిడ్ క్యాప్ లెదర్ పార్కును పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మూతపడ్డ లెదర్ కర్మాగారాన్ని అతి త్వరలో ప్రారంభిస్తామని చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అన్నారు. మాదిగల పట్ల వివక్షత చూపిస్తూ లెదర్ పార్కుల అభివృద్ధిని గత ప్రభుత్వం మరిచిందన్నారు. లిడ్‌క్యాప్, లెదర్‌పార్కుల కోసం కేటాయించిన స్థలాలను మాజీ సీఎం జగన్, ప్రభుత్వ కాలనీలుగా మార్చారన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల మాట్లాడుతూ నియోజకవర్గంలోని లెదర్ పార్క్ తరలిపోతుందంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని మాదిగల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి లెదర్ పార్క్ అవసరం ఉందని తెలపటంతో, ఇక్కడ లెదర్ పార్క్‌ను ఎక్కడికీ తరలించడం లేదని, ఇక్కడే అభివృద్ధి చేసి మాదిగలకు చేదోడుగా ఉంటామని భరోసానిచ్చారు. 28 వేలకు పైగా మాదిగ సోదరులు ఉన్నారన్నారు. ఇక్కడ ఉన్న లెదర్ పార్క్‌ను అభివృద్ధి చేయడం వల్ల చాలా మందికి ఉపాధి కలుగుతుందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే లిడ్ క్యాబకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇక్కడ రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి దృష్టికి తెలియచేయగానే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలివ్వటంతో, రోడ్డు నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈ జీఎస్ ద్వారా రూ. 70 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.



# పెనుకొండ అభివృద్ధికి సహకరించండి

◆మంత్రులు డోలా, ఫరూక్‌ను కోరిన మంత్రి సవిత

అమరావతి (చైతన్యరథం): పెనుకొండ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత మంత్రులు డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎన్ఎండీ ఫరూక్‌ను కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రులను కలిసి పెనుకొండలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులపై మంత్రి సవిత చర్చించారు. పెనుకొండ నియోజకవర్గంలో పలు సమస్యల పరిష్కారానికి మంత్రుల దృష్టికి మంత్రి తీసుకెళ్లారు. పెనుకొండతో పాటు నియోజకవర్గంలో అయిదు మండలాల్లోనూ అంబేద్కర్ భవనాలు నిర్మాణ విషయమై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనతో మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తోనూ మంత్రి సవిత భేటీ అయ్యారు. పెనుకొండలో షాదీఖానా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో పలు సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యమివ్వాలని ఫరూక్‌ను మంత్రి సవిత కోరారు. ఈ భేటీలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

◆ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం (చైతన్యరథం): ఉరవకొండ నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి అనంతపురంలోని ఆర్.అండ్.బి అతిథి గృహంలో ఉరవకొండ నియోజకవర్గంలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలోని గ్రామీణ రహదారుల అభివృద్ధిపై మంత్రి పయ్యావుల కేశవ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితిని అడిగి తెలుసుకుని, ప్రతి రోడ్డుపైన మంత్రి సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని రహదారులను మూడు భాగాలుగా విభజించాలని, పెద్ద గుంతలున్న రోడ్లను, మెటల్ రోడ్లు ఉండి బిటి లేచిపోయిన రోడ్లకు సంబంధించి, కొత్త రోడ్లు వేయాల్సిన రోడ్లకు సంబంధించిన



వివరాలు అందించాలన్నారు. రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పిఎంజిఎస్‌వై, నాబార్డు, ఎన్ఆర్ఈజిఎస్ కింద ప్రాధాన్యత ప్రకారం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఈఈ ప్రభాకర్‌రెడ్డి, డిఈ రసూల్, పిఐయు డిఈ మదన్ మోహన్, ఏఈలు రవీంద్ర, రమణయ్య, లక్ష్మీనారాయణ, పరశురాం, ఏఈ తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన యాత్ర యువగళం

◆అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపి.. ప్రజా ప్రభుత్వానికి మార్గం వేసింది

◆ రాష్ట్రానికి బంగారు భవిష్యత్ కళ్ల ముందే కనిపిస్తోంది

◆ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టీకరణ

రాప్తాడు (చైతన్యరథం): రెండేళ్ల క్రితం టీడీపీ యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వైసీపీ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆయన పాదయాత్ర చేపట్టిన రోజే వైసీపీ ఓటమి ఖాయమైందన్నారు. యువగళం రెండేళ్లు పూర్తైన సందర్భంగా ఆమె అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అరాచకాలతో.. అంతటా భయం, ఆందోళన కమ్ముకున్న సమయంలో యువగళం పాదయాత్ర అందరిలో ధైర్యం నింపిందన్నారు. 2023 జనవరి 27న ప్రారంభమైన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మవ మార్పునకు నాంది పలికిందన్నారు. 226 రోజుల్లో 3,132 కిలోమీటర్లు, 2,097 గ్రామాల్లో ప్రజలను నేరుగా లోకేష్ కలిశారన్నారు. మొత్తం 97 నియోజకవర్గాల్లో పాదయాత్ర కొనసాగగా, 90చోట్ల టీడీపీ విజయం సాధించిందని గుర్తు చేశారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో సుమారు 9రోజుల పాటు పాదయాత్ర సాగిందన్నారు. అప్పుడు ఈ రెండు ప్రాంతాల్లో జరుగుతున్న అరాచకాల్ని, ప్రకాష్‌రెడ్డి సోదరుల అక్రమాలపై గళమెత్తారన్నారు. జాకీ పరిశ్రమ వెనక్కు వెళ్లిపోవడం, మట్టి మాఫియా గురించి ఆయన చేసిన ప్రసంగాలు ప్రజల్ని ఎంతో ఆలోచింపజేశాయన్నారు. అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టి, రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు అన్నివిధాలా లోకేష్ కృషి చేస్తున్నారని కొనియాడారు.

### తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన జగన్ రెడ్డి

గత వైసీపీ పాలనలో జగన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని నిద్రపోయారని.. ఒక ముఖ్యమంత్రే అలా ఉంటే పరిశ్రమలు ఎలా వస్తాయని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రశ్నించారు. జగన్ తాడేపల్లిలో నిద్రపోతుంటే.. ఆయన ఎమ్మెల్యేలు వచ్చిన పరిశ్రమలను కమీషన్ల కోసం బెదిరించి.. రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారన్నారు. జగన్ రెడ్డి నిర్వాకానికి అంధకారంలోకి వెళ్లిన పారిశ్రామిక రంగానికి నూతన వెలుగులు తీసుకురావడం కోసం సీఎం చంద్రబాబు రేయింబవళ్ళు కష్టపడుతున్నారన్నారు. దావోస్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో పర్యటించి అన్ని రంగాలకు కలిపి రూ.11.77 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతమైందని అన్నారు.

## మనం ప్రజా సేవకులం..

# జవాబుదారీగా పనిచేద్దాం

◆సమస్యల పరిష్కారమే మనందరి అజెండా కావాలి

◆కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దు

◆ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి స్పష్టీకరణ

◆కొత్త చెరువులో సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి (చైతన్యరథం): ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాలకులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అన్నారు. కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం మనం జవాబుదారీగా పని చేద్దామన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కోసం కార్యాలయం వద్దకు వస్తే వాటి పరిష్కారానికి తగిన మార్గం చూపాలే కానీ అదేపనిగా కార్యాలయం చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దని సూచించారు. కొత్తచెరువు పట్టణంలో ప్రధాన సమస్యలైన డ్రైనేజీ, సిసి రోడ్లు, వీధిలైట్లు, తాగునీరు, ఇండ్ల స్థలాలు , విద్యుత్ సమస్య ఎక్కువగా ఉన్నాయని, వీటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా కొత్తచెరువు ప్రజల రాకపోకలకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం అసౌకర్యంగా ఉందని తెలిపారు. వీటి స్థానంలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం కోసం కేంద్ర రైల్వే సహాయం మంత్రి సోమన్నను స్వయంగా ఈ ప్రాంతానికి పిలిపించి ప్రజల సమస్యను విన్నవించామన్నారు. అతి త్వరలో వాటి పరిష్కారానికి తగిన నివేదికలు వెంటనే ఇవ్వాలని సంబంధిత రైల్వే అధికారులకు మంత్రి సోమన్న ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రజలకు వెల్లడించారు.

కొత్తచెరువు ప్రధాన పట్టణం కావడం వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, వీటికి పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకి విన్నవించారు. కొత్తచెరువు పట్టణం మీదుగా రెండు జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచిందని గుర్తు చేశారు . తాడిపత్రి, బత్తలపల్లి, ధర్మవరం, కొత్తచెరువు మీదుగా జగరాజులపల్లి వద్ద జాతీయ రహదారికి అనుసంధానం కానుందన్నారు. అలాగే పావుగడ, మడకశిర, పెనుకొండ , కొత్తచెరువు, బుక్కపట్నం జాతీయ రహదారిలోకి మరో మార్గం అనుసంధానం కానుందని తెలిపారు. దీనివల్ల రోడ్ల విస్తరణతో పాటు ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు.


కొత్తచెరువు పట్టణంలో ప్రధాన రోడ్లపై విస్తరించిన అక్రమ కట్టడాలతో పాటు పలు కాలనీ వీధుల్లో డ్రైనేజీలను ఆక్రమించిన వాటిని తక్షణం రెవెన్యూ, పోలీస్ సహకారంతో పంచాయతీ అధికారులు తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.



మండలంలో కేశాపురం , మైలసముద్రం ఇరగంపల్లి ,ఇండ్ల వెంకటం పల్లి ,కొత్తచెరువు , బండ్లపల్లి ,బైరాపురం ప్రాంతాల్లో ఎక్కువగా వోల్టేజీ సమస్య పరిష్కారానికి విద్యుత్ అధికారులు తక్షణ నివారణ చర్యలు తీసుకోవాలని విద్యుత్ వెంకటేష్ ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశించారు. కేశపురం గ్రామంలో ఉన్న సబ్ స్టేషన్ నుంచి ఇతర మండలాల్లోని గ్రామాల రైతులకు విద్యుత్ సరఫరా కావడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతు లక్ష్మీనారాయణ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ డీఈ శివరాం ఏ ఈ వెంకటేష్ నాయక్ కు ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే ప్రజలు విద్యుత్ సమస్యతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎక్కువ ఫిర్యాదులు కూడా కరెంట్ సమస్యలపైనే ప్రజల నుంచి వస్తున్నాయని ఎమ్మెల్యే ప్రస్తావించారు. మండల ఏఈ వెంకటేష్ నాయక్ పనితీరు సక్రమంగా లేదని తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేగా తాను అనేకసార్లు విద్యుత్ సమస్యలపై ప్రస్తావిస్తే ఇంతవరకు వాటి పరిష్కారం చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం విద్యుత్ అధికారులు తమ ప్రవర్తన మార్చుకుని ప్రజల కోసం పనిచేయాలని లేదంటే, ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లాలని సూచించారు.

అనంతరం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ, కొత్తచెరువు పట్టణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే కోటి 18 లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా మండలంలో రూ.3 కోట్ల 18 లక్షలతో గ్రామాల్లో రోడ్లు నిర్మాణం చేపట్టామని తెలిపారు. అంతేకాకుండా మండలంలో 69 లక్షలతో గోకులం మినీ షెడ్లు నిర్మాణం చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మూడు మండలాలకు సుమారు 120 గ్రామాలకు తాను 2014 నుంచి 2019 వరకు మంత్రిగా ఉన్నప్పుడు తాగునీటి పరిష్కారానికి రూ.140 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. కొత్తచెరువు పట్టణంతోపాటు మండలంలో తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాధ, పట్టణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మండల టిడిపి కన్వీనర్ రామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు సాలెక్కగారి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా, జనసేన పూల శివ, బిజెపి నాయకులు దివ్య తేజ, శేషాద్రి నాయుడు, టీడీపీ మహిళా నాయకురాలు రాధమ్మ, గ్రామవార్డు సభ్యులు కవిత, అధికారులు, కొత్తచెరువు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# 31 నుండి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు



న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 31వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడుతల్లో జరుగనుండగా, తొలి విడత సమావేశాలు 31 నుంచి మొదలై ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. ఇక రెండో విడత సమావేశాలు మార్చి 10న మొదలై ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగుతాయి. మంగళవారం విడుదలైన పార్లమెంటరీ బులిటెన్ ప్రకారం.. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్-2025ను ప్రవేశపెడతారు. అంతకుముందు రోజు రాష్ట్రపతి ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగం తర్వాత అరగంటకు రాజ్యసభ కార్యకలాపాలు మొదలవుతాయి.

పార్లమెంట్ సమావేశాలకు ముందురోజు జనవరి 30న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాబోయే సమావేశాల్లో సభను సజావుగా నిర్వహించేందుకు ప్రతిపక్ష నాయకులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గతంలో సమావేశాలు జరిగిన తీరును ప్రస్తావించారు. రెండు సెషన్లలో పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం నెలకొంది. దాంతో పార్లమెంట్ ప్రతిష్ట దెబ్బతిందని.. ఈ సమావేశాల్లోనైనా ప్రతిపక్ష నాయకులు, ఇతర ఎంపీలు చర్చల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షం సహకరిస్తేనే పార్లమెంట్ పని చేయడంతో పాటు చర్చలు జరుగుతాయన్నారు. ఈసారి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి బడ్జెట్ బాగుటుందని అందరూ ఆశిస్తున్నారని తెలిపారు.

### ఆదినాథుడి లడ్డూ వేడుకలో అపశృతి

## కూలిన వేదిక.. ఆరుగురు భక్తుల మృతి

లక్నో: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బాగ్‌పత్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. ఆదినాథుడి లడ్డూ వేడుకలో అపశృతి చోటు చేసుకుంది. లడ్డూ వేదిక కుప్పకూలడంతో ఆరుగురు భక్తులు మృతి చెందగా.. 50 మందికి పైగా తీవ్రగాయాలయ్యాయి. లడ్డూల కోసం భక్తులు పెద్దఎత్తున పోటీపడడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై ఆరా తీశారు. బాధితులను వెంటనే ఆస్పత్రికి తరలించాలని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు.



బాగ్‌పత్ జిల్లా మేజిస్ట్రేట్ అస్మితా లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. "బరౌత్‌లోని స్థానిక జైన కమ్యూనిటీ 30 ఏళ్లుగా ఏటా 'లడ్డూ మహోత్సవం' నిర్వహిస్తోంది. పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వందల మంది భక్తులు తరలివచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం లడ్డూలు పంచిపెట్టేందుకు పూజారులు సిద్ధమయ్యారు. కాగా వాటిని పొందేందుకు ఎదురుబొంగులతో నిర్మించిన వేదికపైకి వందల మంది భక్తులు ఒక్కసారిగా ఎక్కారు. దీంతో వేదిక కూలిపోయి భారీ ప్రాణనష్టం జరిగింది. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించాం. స్వల్పంగా గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి ఇళ్లకు పంపించాం. తీవ్రగాయాలైన వారికి చికిత్స అందిస్తున్నామని" తెలిపారు.



# భారత్ మత్స్యకారులపై శ్రీలంక నేవీ కాల్పులు

### ◆తీవ్ర నిరసన తెలిపిన భారత్

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన మత్స్యకారులపై శ్రీలంక నేవీ కాల్పులు జరపడంపై విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనలో ఇద్దరు మత్స్యకారులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ శ్రీలంక రాయబారికి భారత్ సమన్లు జారీ చేసింది. అటు కొలంబోలోని భారత హైకమిషన్ కూడా ఈ విషయాన్ని శ్రీలంక విదేశాంగ శాఖ ముందు లేవనెత్తినట్లు తెలిపింది.

శ్రీలంక తీరంలోని డెల్ఫ్ దీవికి సమీపంలోకి వెళ్లిన 13 మంది భారత జాలర్లను అక్కడి నౌకాదళం అడ్డుకుంది. తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన వీరిని అరెస్టు చేస్తున్న సమయంలో పలువురు తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. దీంతో వారిపై శ్రీలంక నావికాదళం కాల్పులు జరిపింది. ఆ ఘటనలో ఇద్దరు మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జాఫ్నా ఆసుపత్రిలో చేర్పించగా.. గాయపడిన మరో ముగ్గురితో పాటు మిగతావారందర్నీ శ్రీలంక పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే జాఫ్నాలోని భారత కాన్సులేట్ అధికారులు ఆసుపత్రికి వెళ్లి గాయపడిన జాలర్లను పరామర్శించారు.

ఇదే అంశంపై ఢిల్లీలోని శ్రీలంక రాయబారికి భారత్ సమన్లు జారీ చేసింది. మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని వారి సమస్యలపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని భారత్ ఎల్లప్పుడూ కోరుకుంటోందని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఎటువంటి పరిస్థితుల్లోనూ బలప్రయోగం చేయడం ఆమోదయోగ్యం కాదని మరోసారి తేల్చి చెప్పింది. ఈ విషయంలో ఇరు ప్రభుత్వాల మధ్య కొనసాగుతున్న అవగాహన ఒప్పందాలను కచ్చితంగా పాటించాలని సూచించింది.

# 'మహాకుంభ్' రైళ్లపై రాళ్ల దాడి

భోపాల్: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్ మేళాకు వెళ్తున్న ప్రత్యేక రైళ్లపై మధ్యప్రదేశ్‌లో రాళ్ల దాడి జరిగింది. మహాకుంభ్ వెళ్లేందుకు ప్లాట్‌ఫాం మీద సిద్ధంగా నున్న ప్రయాణికులు ఆగ్రహంతో రాళ్లు రువ్వుతూ విధ్వంసం సృష్టించే ప్రయత్నం చేశారు. ఛాతర్‌పూర్ జిల్లాలోని రెండు రైల్వేస్టేషన్లలో ఈ ఘటనలు చేసుకున్నాయి. ప్రయాణికులతో రైళ్లు కిక్కిరిసిపోవడం, తలుపులు మూసేసి కనిపించడం, డోర్లు ఎవరూ తెరవకపోవడంతో అప్పటికే ప్లాట్‌ఫాం మీద వేచిచూస్తున్న ప్రయాణికులు కొందరు ఆగ్రహావేశాలకు లోనైనట్టు పలు వీడియోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఛాతర్‌పూర్, హర్పల్ పూర్ రైల్వే స్టేషన్లలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. కొందరు రాళ్లు రువ్వగా, మరికొందరు బోగీల తలుపులు బాదుతూ విధ్వంసం సృష్టించారు.

ఛాతర్‌పూర్, హర్పల్‌పూర్ రైల్వే స్టేషన్లలో జరిగిన ఘటనలపై అధికారులు వెంటనే స్పందించారు. ప్రయాణికుల భద్రతకు కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 29న మౌని అవావాస్య సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌కు ప్రయాణికుల రద్దీ బాగా పెరిగిందని, డిమాండ్‌కు తగ్గట్టుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని తెలిపారు. రైళ్ల కిటికీలు, డోర్లు మూసేయడంతో ప్రయాగ్‌రాజ్ వెళ్లే రైలు ఎక్కలేకపోయినట్టు ఒక ప్రయాణికుడు తెలిపాడు. ఛాతర్‌పూర్ స్టేషన్ వద్ద ప్రయాణికులు ఆందోళనకు దిగడం, రాళ్లు రువ్వడంతో ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) వెంటనే జోక్యం చేసుకుని, రైలు తలుపులు తెరిపించినట్టు చెప్పాడు.

# నేడు ఇస్రో వందో ప్రయోగం

### ◆జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 15 కౌంట్‌డౌన్

శ్రీహరికోట: భారత అంతరిక్ష కార్యక్రమంలో మరో మైలురాయిని చేరుకోవడానికి ఇస్రో సర్వం సిద్ధం చేసింది. ఈనెల 29న శ్రీహరికోటలోని షార్ నుంచి తన వందో ప్రయోగమైన జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌ను రోదసిలోకి పంపనుంది. దేశీయంగా రూపొందించిన ఈ క్రయోజనిక్ రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపనుంది. దీనికి సంబంధించిన కౌంట్‌డౌన్‌ను మంగళవారం తెల్లవారుజామున 2.53 గంటలకు ప్రారంభించింది. 27 గంటలపాటు ఈ కౌంట్‌డౌన్ కొనసాగనుంది. బుధవారం ఉదయం 6.23 గంటలకు షార్‌లోని రెండో ల్యాంచ్‌ఫ్యాడ్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది.

జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ జీఎస్ఎల్వీ సిరీస్‌లో 17వది, దేశీయ క్రయోజెనిక్ స్టేజ్ కలిగిన 11వ రాకెట్. ఈ ప్రయోగం ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా దేశీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్ మరింత విస్తృతం కానున్నది. ఈ ఉపగ్రహం సెకండ్ జెనరేషన్ శాటిలైట్ కాగా.. ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని 29 మే 2023న ఇస్రో నింగిలోకి పంపింది. ఇది ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం ఎన్‌వీఎస్ సిరీస్‌లో రెండో ఉపగ్రహం. ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్‌లలో నావిగేషన్ పేలోడ్లను.. అలాగే తొలితరం ఉపగ్రహం ఎన్‌వీఎస్-01లో ఉన్నట్లుగానే సీ బ్యాండ్‌లో రేజింగ్ పేలోడ్స్ ఉంటాయి. నావిక్ అనేది భారతదేశ స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ.



భారత భూభాగం నుంచి దాదాపు 1500 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో వినియోగదారులకు ఖచ్చితమైన స్థానం, వేగం, సమయం సేవలను అందించడం దీని ఉద్దేశం. కొత్త శాటిలైట్‌తో దేశీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్ మరింత విస్తృతం కానున్నది. ఈ ఉపగ్రహాన్ని బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో రూపొందించగా.. ఇతర శాటిలైట్ సెంటర్లు సహకారం అందించాయి. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ జీఎస్ఎల్వీ సిరీస్‌లో 17వది కావడం విశేషం. దేశీయ క్రయోజెనిక్ స్టేజ్ కలిగిన 11వ రాకెట్. ఈ ప్రయోగం ద్వారా ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ఇస్రో ప్రవేశపెడుతుంది.

# అయోధ్యకు పోటెత్తుతున్న భక్తులు

### ◆ఒక్క రోజే 25 లక్షల మంది దర్శనం

లక్నో: మహాకుంభ మేళా వేళ ఉత్తరప్రదేశ్‌లోని ప్రఖ్యాత ప్రదేశమైన అయోధ్యకు కూడా భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయోధ్య రామమందిరాన్ని సందర్శిస్తున్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున అయోధ్యలోని రామమందిరాన్ని 25 లక్షల మందికిపైగా భక్తులు సందర్శించినట్లు ఆలయ ట్రస్ట్ తెలిపింది. భక్తులు రామ్‌లల్లాతోపాటు హనుమాన్‌గర్హి ఆలయాన్ని సందర్శిస్తున్నట్లు పేర్కొంది. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వస్తున్న భక్తులు అటునుంచి అయోధ్యకు వస్తున్నట్లు తెలిపింది. కాగా, భక్తుల రాకతో అయోధ్యా నగరి రద్దీగా మారింది. మరోవైపు రానున్న రోజుల్లో అయోధ్యకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రద్దీ దృష్ట్యా రామమందిరం, హనుమాన్ గర్హి ఆలయాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించింది.

### మౌనీ అమావాస్య నాడు 10 కోట్ల మంది పుణ్య స్నానాలు

త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్ల సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివస్తున్నారు. ఇప్పటికే 15 కోట్ల మంది మహాకుంభ్‌లో అమృత స్నానాలు చేశారు. అయితే నేడు మౌనీ అమావాస్య సందర్భంగా .. కుంభమేళాకు ఒక్క రోజే సుమారు పది కోట్ల మందికిపైగా వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీని కోసం యూపీ సర్కారు భారీగా ఏర్పాట్లు చేసింది. గడిచిన 17 రోజుల్లో ప్రతిరోజూ సుమారు కోటి మంది వరకు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. బుధవారం మౌనీ



అమావాస్య కోసం భారీ ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఏఐ ఆధారిత సీసీ కెమెరాలను అమర్చారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌ను నో వెహికిల్ జోన్‌గా ప్రకటించారు. సంగంకు వెళ్లే స్థానికులు ఫోర్ వీలర్లను కాకుండా, టూ వీలర్లను వాడాలని ప్రభుత్వం సూచించింది.

### మౌనీ అమావాస్య ప్రత్యేకత

మౌనీ అమావాస్య రోజున నదీ స్నానం విశేషమైంది. మహాకుంభమేళాలో అమావాస్య రోజున నిర్వహించే స్నానాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో బుథదీరవ ఉదయం 6.45 నిమిషాలకు త్రివేణి సంగమంలో స్నానం ఆచరించే భక్తులపై పూలవర్షం కురిపించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. షాహి స్నానం నిర్వహించే తేదీల్లో.. నాగ సాధువులు, అకాడాలు భారీ ర్యాలీగా నదీ తీరానికి చేరుకుంటారు. అమృత స్నాన దినాల్లో అదే ఆకర్షణీయమైంది. అయితే సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి.. ఒకే రేఖలోకి రావడం వల్ల.. పవిత్ర నదుల ఆధ్యాత్మిక శక్తి మరింత ద్విగిణీకృతం అవుతుందని భావిస్తారు.


# అమెరికన్లకు ఆదాయపన్ను రద్దు

## సంకేతాలిచ్చిన డొనాల్డ్ ట్రంప్

అమెరికా పౌరులకు ఆదాయపు పన్నునుంచి విముక్తి కల్పించేలా సోమవారం ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనలు చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఖర్చు చేసి ఆర్థిక వ్యవస్థలోకి నిధుల ప్రవాహాన్ని పెంచేందుకే ఈ దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రజలను ధనవంతులు చేసే వ్యవస్థ పునరుద్ధరణ దిశగా ఈ చర్య ఉపయోగపడుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వానికి లభించే ఆదాయంలో ఇన్‌కం ట్యాక్స్ నుంచి వచ్చే మొత్తం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. ట్రంప్ నిర్ణయంతో ఆ మేరకు కోతపడితే.. దానిని భర్తీ చేసుకొనేందుకు దిగుమతి సుంకాలను వాడుకోవాలన్నది ప్రణాళికగా చెబుతున్నారు. "అమెరికన్లను ధనవంతులు, మరింత శక్తిమంతులుగా చేసే వ్యవస్థలోకి మనం వెళుతున్నాం. ఇతర దేశాలను సుసంపన్నం చేసేందుకు మనవారిపై పన్నులు వేసే బదులు.. మనమే విదేశాలపై పన్నులు విధించి అమెరికన్లను సంపన్నులు చేయాలి. వీటిని వసూలు చేసేందుకు ఎక్స్‌టర్నల్ రెవెన్యూ సర్వీసును ప్రారంభించాను" అని రిపబ్లికన్ సభ్యుల సమావేశంలో వ్యాఖ్యానించారు.

అమెరికా చరిత్రలోనే 1870నుంచి 1913మధ్య ప్రజలు అత్యధిక సంపదతో తులతూగారని ట్రంప్ పేర్కొన్నారు. నాడు సుంకాల ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఉండేదని చెప్పారు. అప్పట్లో దిగుమతి సుంకాల నుంచి ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం లభించేదన్నారు. అమెరికా తక్షణమే తన వాణిజ్య వ్యవస్థను మార్చుకోవాలన్నారు. అమెరికా ఉద్యోగులు, కుటుంబాలను రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

భారత్, చైనా, బ్రెజిల్‌పై అత్యధిక పన్నులు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. "బయట దేశాలు ఏం చేస్తున్నాయో చూడండి. చైనా భారీగా పన్నులు వసూలు చేస్తుంది. భారత్, బ్రెజిల దేశాలూ ఆ పద్ధతినే అనుసరిస్తున్నాయి. మనం అలా జరగనీయకూడదు. అమెరికా ప్రయోజనాలు అన్నింటికంటే ముందుండాలి" అని పేర్కొన్నారు. వాస్తవానికి ట్రంప్ గత డిసెంబర్లోనే బ్రిక్స్ దేశాలు ప్రత్యేక కరెన్సీ తీసుకొస్తే 100శాతం సుంకం విధిస్తామని హెచ్చరించారు. డాలర్ వినియోగం నిలిపేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.



# వారంలో నాలుగురోజులే పని

## యూకేలో విస్తరిస్తున్న కొత్త పని విధానం.. 200 కంపెనీలలో అమలు

'పని గంటలపై భారత్ సహా అనేక దేశాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతున్న వేళ యూకేకు చెందిన కొన్ని కంపెనీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఎలాంటి వేతన కోత లేకుండా శాశ్వతంగా వారానికి నాలుగు పని దినాలను అమలు చేస్తున్నాయి. పేరొందిన పలు ఛారిటీలు, మార్కెటింగ్, టెక్నాలజీ సంస్థలు సహా 200 కంపెనీలు ఈ విధానంలో మారినట్లు బ్రిటన్ మీడియా కథనాలు వెల్లడించాయి. '4 డే వీక్ ఫౌండేషన్' చేసిన సర్వేలో భాగంగా ఈవిషయం వెల్లడైనట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. తాజా పని విధానంతో ఈ కంపెనీల్లో పని చేస్తున్న 5వేల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. దీనిపై '4 డే వీక్ ఫౌండేషన్' క్యాంపెయిన్ డైరెక్టర్ జో రైల్ మాట్లాడుతూ.. "9–5 జాబ్, వారానికి ఐదు రోజుల పని అనేవి వందేళ్ల కిందటి విధానాలు. ప్రస్తుత అవసరాలకు ఇవి పనిచేయవు. మనం అప్డేట్ అవ్వాల్సిన సమయం వచ్చింది.





వారానికి నాలుగు రోజుల పని విధానంతో ఉద్యోగులకు ఎక్కువ ఖాళీ సమయం అందుబాటులో ఉంటుంది. దానివల్ల ప్రజలు సంతృప్తికర జీవితాలను గడిపేందుకు స్వేచ్ఛ లభిస్తుంది" అని అభిప్రాయపడ్డారు.

తొలుత వారానికి నాలుగు రోజుల పని విధానాన్ని బ్రిటన్‌లో దాదాపు 30 మార్కెటింగ్, అడ్వర్టైజింగ్. ప్రెస్ రిలేషన్స్ సంస్థలు అమలుచేశాయి. తర్వాత 29 ఛారిటీలు, 24 టెక్నాలజీ, ఐటీ, సాఫ్ట్వేర్ సంస్థలు, 22 మేనేజ్మెంట్, కన్సల్టింగ్ సంస్థలు కూడా ఇదేబాట పట్టినట్లు సర్వేలో వెల్లడైంది. అత్యధికంగా లండన్‌లో 59 కంపెనీలు నూతన పని విధానాన్ని అనుసరిస్తున్నాయి.

# మస్క్ తీరు.. ప్రమాదకరం

## ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా వ్యాఖ్యానించిన ఫ్రాన్స్ పీఎం బేరో

ప్రపంచ నేతలతో అపర కుబేరుడు ఎలాన్ మస్క్‌కు విభేదాలు పెరుగుతున్నాయి. తాజాగా ఫ్రాన్స్ ప్రధాని ఫ్రాంకోయిస్ బేరో మస్క్‌పై తీవ్ర విమర్శలు చేశారు. మస్క్ తీరు ప్రజాస్వామ్యానికి ముప్పుగా పేర్కొన్నారు. 'ఎలాన్ మస్క్ ప్రజాస్వామ్యానికి ముప్పు సృష్టిస్తున్నాడు. మనస్సాక్షిని పాలించే హక్కు డబ్బుకు ఇవ్వకూడదు' అని బేరో ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మస్క్ ఇటీవల ఫ్రాన్స్, యూరప్‌ను ఉద్దేశిస్తూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలకు ఆయా దేశాలు దాసోహం



కావాల్సిందేనని వ్యాఖ్యానించారు. కుదరనిపక్షంలో ఆధిపత్యం, అణచివేత, అట్టడుగుస్థాయిని ఎదుర్కోవాల్సి వస్తోందంటూ హెచ్చరించారు.

ఈనేపథ్యంలో ఫ్రాన్స్ ప్రధాని తాజాగా స్పందించారు. కొన్ని నెలలనుంచి మస్క్‌కు, ప్రపంచ నేతలకు మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయి. జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్, కెనడా ప్రధాని ట్రూడో, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌వంటి వారితో మాటల యుద్ధాలకు దిగారు. ఇటీవల కాలంలో మస్క్ బ్రిటన్ రాజకీయాల గురించి ఎక్కువగా స్పందిస్తున్నారు. అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. విపక్షం రీఫామ్ యూకేకు మద్దతు తెలుపుతున్నారు. మరోవైపు తమ దేశ ఎన్నికల్లో టెస్లా అధినేత నేరుగా జోక్యం చేసుకొంటున్నాడని ఫ్రాన్స్ అధినేత మేక్రాన్, కెనడా ప్రధాని ట్రూడో, యూకే పీఎం స్టార్మర్, నార్వే ప్రధాని జోనాస్ ఆరోపించారు. అంతేకాక.. యూకేలోని గ్రూమింగ్ గ్యాంగ్స్ అరాచకాలపై సైతం వరుస ప్రకటనలు చేశారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హోదాలో ఉన్నవేళ స్టార్మర్ వాటిని అదుపు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ ఆరోపణలను యూకే పీఎం స్టార్మర్ తిరస్కరించారు. మస్క్ పేరు ప్రస్తావించకుండా.. అబద్ధాలు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్నారు. అత్యాచారాలకు గురైన చిన్నారులకు న్యాయం చేయడానికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.



*తాను భారత్–అమెరికా అనుబంధ ప్రోడక్టునని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అన్నారు. వివిధ రంగాల్లో సాంకేతికతను ఎలా వినియోగించుకోవాలనే విషయంపై ఇరుదేశాల నాయకత్వాలు ఎక్కువ దృష్టి కేంద్రీకరించాయని కొనియాడారు. భారత రిపబ్లిక్ డే సందర్భంగా కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆదివారం బెల్ హార్బర్ కాన్ఫరెన్స్ సెంటర్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ నేపథ్యంలో అమెరికా అభివృద్ధికి భారత సంతతి ప్రజలిచ్చిన సహకారాన్ని ఆ దేశ చట్ట సభ్యులు, ఉన్నతాధికారులు కొనియాడినపుడు.. కార్యక్రమానికి గౌరవ అతిధిగా హాజరైన మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అలా వ్యాఖ్యానించారు.*

# ప్రక్షాళన..!!

## అమెరికా న్యాయ విచారణ అధికారులపై ట్రంప్ కొరడా

2020 ఎన్నికల్లో ఓటమి తర్వాత తనపై దర్యాప్తును ముందుకుతీసుకెళ్లిన అధికారులపై ట్రంప్ చర్యలు చేపట్టారు. ప్రస్తుత అటార్నీ జనరల్ జేమ్స్ మెక్ హెన్రీతోపాటు, మరో డజనుమంది అధికారులను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అధ్యక్షుడి అజెండాను ముందుకు తీసుకెళ్లే క్రమంలో వీరిని విశ్వసించలేమని అందులో పేర్కొన్నారు. ఈ చర్యలకు గురైన వారిలో –ట్రంప్ ఎన్నికల ఓటమి తర్వాత దర్యాప్తునకు నాయకత్వం వహించిన మాజీ స్పెషల్ కౌన్సిల్ జాక్ స్మిత్ కూడా ఉన్నారు. ట్రంప్‌పై స్మిత్ రెండు దర్యాప్తులు చేశారు. 2020 ఎన్నికల ఫలితాలను ట్రంప్ ఉద్దేశపూర్వకంగా మార్చేందుకు యత్నించారన్నది స్మిత్ చేసిన ప్రధాన ఆరోపణ. అలాగే, రహస్య పత్రాలను తనతోపాటు తీసుకెళ్లారన్నది మరో కేసు. వాస్తవానికి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లలో తన రాజకీయ శత్రువుల పదవులకు ట్రంప్ ఎసరు పెట్టారు. స్మిత్ బృందంపైనా వేటు ఖాయమనే సంకేతాలు అప్పుడే వెళ్లాయి. వాస్తవానికి 2024 అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడగానే స్మిత్ ఈ రెండు కేసులను ట్రంప్‌పైనుంచి తొలగించారు. సిట్టింగ్ అధ్యక్షుడిని విచారించే అధికారం జస్టిస్ డిపార్ట్‌మెంట్‌కు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోకతప్పలేదు.

### సైనిక దళాల్లో కీలక మార్పులు..

అమెరికా మిలటరీని పునర్వ్యవస్థీకరించాలని సోమవారం ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దీంతోపాటు ట్రాన్స్‌జెండర్లు అమెరికా సాయుధ దళాల్లో పనిచేయకుండా నిషేధం విధించారు. కొవిడ్ వ్యాక్సిన్లు తీసుకోవడానికి నిరాకరించి చర్యలకు గురైనవారిని మళ్లీ దళాల్లోకి తీసుకొంటున్నట్టు ప్రకటించారు. ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు వస్తున్న సమయంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆయన ఈ ఆదేశాలపై సంతకం చేసినట్లు శ్వేతసౌధం ప్రకటించింది.

### టిక్‌టాక్‌లో వాటాకోసం మైక్రోసాఫ్ట్ యత్నం

ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్‌లో వాటా కోసం టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ ప్రయత్నాలు చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈమేరకు ఆ కంపెనీ చర్చలు కొనసాగిస్తోందని.. ఆ యాప్‌లో వాటా కోసం బిడ్డింగ్ వార్ జరగొచ్చని వ్యాఖ్యానించారు. టిక్‌టాక్‌ను కొనుగోలు చేయడానికి చాలా సంస్థలు పోటీపడుతున్నా.. జాయింట్ వెంచర్లో అమెరికాకు 50 శాతం వాటా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు మరోసారి ఉద్ఘాటించారు. యూఎస్‌కు ప్రయోజనం చేకూర్చే వాటిని తాను ప్రోత్సహిస్తానన్నారు.

టిక్‌టాక్‌పై పూర్తిగా చైనీస్ ఆధిపత్యం ఉండటం తనకిష్టం లేదని.. ఉమ్మడి వెంచర్లో తమకు 50 శాతం వాటా ఉండాలని ట్రంప్ గతంలో పేర్కొన్నారు. దీనికి వారు అంగీకరిస్తే ఉత్తమంగా నడిపించే వారి చేతుల్లోకి అది వెళుతుందన్నారు. సోషల్ మీడియా 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్‌కు టిక్‌టాక్‌ను విక్రయించాలని సంస్థ యాజమాన్యం యోచిస్తున్నట్లు పలు మీడియా సంస్థలు పేర్కొన్న విషయం తెలిసిందే. కాగా ట్రంప్ అధికారంలోకి వచ్చిన అనంతరం 75 రోజుల్లోగా టిక్‌టాక్‌ను అమ్మేయాలంటూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపైన సంతకం చేశారు.

2017లో ప్రారంభమైన టిక్‌టాక్‌ను భారత్ సహా పలు దేశాలు నిషేధించాయి. అమెరికాలోని కొన్ని రాష్ట్రాలూ దీని వినియోగంపై ఆంక్షలు పెట్టాయి. ఈనేపథ్యంలో ఇటీవల అమెరికా ప్రతినిధుల సభ ఓ బిల్లుకు ఆమోదం తెలిపింది. చైనా యాజమాన్యాన్ని వదులుకోకపోతే నిషేధం ఎదుర్కోవాల్సిందే అనేది బిల్లులోని సారాంశం. అనంతరం అమెరికా సుప్రీంకోర్టు కూడా టిక్‌టాక్ మాతృసంస్థ బైట్ డ్యాన్స్‌కు డెడ్‌లైన్ ఇచ్చింది. ఈనేపథ్యంలో టిక్‌టాక్ సేవల్ని ఆపివేస్తున్నట్లు సంస్థ ఇటీవల యూజర్లకు సమాచారం అందించింది.

## అండర్-19 మహిళల వరల్డ్ కప్..

# స్కాట్లాండ్‌పై టీమిండియా ఘన విజయం

### తెలుగమ్మాయి గొంగడి త్రిష అద్భుత శతకం






అండర్-19 మహిళల వరల్డ్ కప్‌లో భాగంగా స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయాన్ని సాధించింది. సూపర్ సిక్స్‌లో భాగంగా తాజాగా జరిగిన రెండో మ్యాచ్‌లో తెలుగమ్మాయి గొంగడి త్రిష దెబ్బకు 58 పరుగులకే స్కాట్లాండ్ చేతులెత్తేసింది. దీంతో 150 పరుగుల తేడాతో ఆ జట్టు ఘోర పరాజాయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 208 పరుగులు చేసింది. ఆ తర్వాత బరిలోకి దిగిన స్కాట్లాండ్ 14 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలిపోయింది. ఓపెనర్లు వాల్‌సింగమ్ (12), పిప్పా (12), పిప్పా స్ప్రోల్ (11) మాత్రమే రెండంకెల స్కోరు నమోదు చేశారు. భారత్ బౌలర్లలో శుక్ల 4 వికెట్లు పడగొట్టగా, వైష్ణవి శర్మ, త్రిష చెరో 3 వికెట్లను తమ ఖాతాలో వేసుకున్నారు.

### తెలుగమ్మాయి సెంచరీ!

టోర్నీలోని ప్రతి మ్యాచ్‌లోనూ తనదైన శైలిలో ఆడి అభిమానులను అలరిస్తోన్న తెలుగమ్మాయి గొంగడి త్రిష ఈ సారి కూడా అద్భుతంగా ఆడింది. ఈ క్రమంలో కేవలం 53 బంతుల్లోనే శతకం (110) బాది అండర్-19 టీ20ల్లో తొలి సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గా రికార్డుకెక్కింది. దీంతో పాటు ఆల్‌రౌండ్ పెర్ఫామెన్స్‌తో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు'ను అందుకుంది.

### వాళ్లూ అదుర్స్!

ఓపెనర్లు త్రిష - కమలిని కలిసి తొలి వికెట్ సమయానికి 147 పరుగులను జోడించారు. హాఫ్ సెంచరీ తర్వాత కమలిని ఔటైనప్పటికీ భారత ఇన్నింగ్స్ మాత్రం ఆగలేదు. సానికాతో కలిసి చివరి వరకూ క్రీజ్‌లో ఉన్న త్రిష రెండో వికెట్ సమయానికి 61 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించింది. అలా త్రిష తన సెంచరీతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించగా, ఓపెనర్ కమలిని(51) కూడా హాఫ్ సెంచరీ చేసి జట్టుకు కీలక ఇన్నింగ్స్ అందించింది. వీరిద్దరితో పాటు సానికా చల్కే (29) కూడా మంచి ఇన్నింగ్స్ ఆడింది.

ఈ క్రమంలో ఇప్పటికే సెమీస్‌కు చేరుకున్న భారత్, తాజాగా జరిగిన సూపర్ సిక్స్‌లోనూ తన చివరి మ్యాచ్‌లోనూ భారీ స్కోరు నమోదు చేసింది. ఇది కూడా అండర్ 19 టీ20ల్లో ఓ రేర్ రికార్డు కావడం విశేషం.

భారత మహిళల అండర్-19 స్క్వాడ్ : నికి ప్రసాద్ (కెప్టెన్), గొంగడి త్రిష, సానికా చల్కే, ఈశ్వరి అవ్సరే, మిథిలా వినోద్, భావిక అహిరే, ఆయుషి శుక్లా, జి కమలిని (వికెట్ కీపర్), షబ్నం ఎండి షకీల్, వైష్ణవి శర్మ, సోనమ్ యాదవ్.

స్కాట్లాండ్ ఉమెన్ అండర్-19 స్క్వాడ్ : నియామ్ ముయిర్ (కెప్టెన్), పిప్పా కెల్లీ, అమేలీ బాల్డీ, ఎమ్మా వాల్సింగ్‌హామ్, పిప్పా స్ప్రోల్ (వికెట్ కీపర్), నయ్మా షేక్, షార్లెట్ నెవార్డ్, గాబ్రియెల్లా ఫోంటెన్లా, మైసీ మసీరా, మోలీ పార్కర్, క్రిస్టీ మెక్‌కాల్.

# మూడో టీ 20లో భారత్ ఓటమి

## టీమిండియా కొంపముంచిన బ్యాటింగ్ వైఫల్యం

### 26 పరుగుల తేడాతో ఇంగ్లండ్ విజయం - ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వరుణ్ చక్రవర్తి (5/24)




ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా జోరుకు బ్రేక్ పడింది. రాజ్‌కోట్ వేదికగా మంగళవారం జరిగిన మూడో టీ20లో టీమిండియా 26 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ సత్తా చాటింది. బ్యాటింగ్ వైఫల్యం టీమిండియా కొంపముంచింది. భారత్ ఓటమి పాలయినప్పటికీ 5 వికెట్లు తీసిన వరుణ్ చక్రవర్తికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కటం విశేషం.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులు చేసింది. బెన్ డకెట్(28 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సలతో 51) హాఫ్ సెంచరీతో రాణించగా.. లియామ్ లివింగ్‌స్టోన్(24 బంతుల్లో ఫోర్, 5 సిక్సలతో 43) ధాటిగా ఆడాడు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి (5/24) ఐదు వికెట్లతో సత్తా చాటగా.. హార్దిక్ పాండ్యా(2/24) రెండు వికెట్లు పడగొట్టాడు. రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు.

అనంతరం భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 146 పరుగులు చేసి ఓటమిపాలైంది. భారత బ్యాటర్లలో హార్దిక్ పాండ్యా (35 బంతుల్లో ఫోర్, 2 సిక్సలతో 40), అభిషేక్ శర్మ(14 బంతుల్లో 5 ఫోర్లతో 24) మినహా అంతా విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్ రెండేసి వికెట్లు తీయగా.. జామీ ఓవర్టన్ మూడు వికెట్లు పడగొట్టాడు. మార్క్ వుడ్‌కు ఓ వికెట్ దక్కింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 1-2తో నిలిచింది.

### దక్కని శుభారంభం..

లక్ష్యచేధనలో టీమిండియాకు ఆశించిన శుభారంభం దక్కలేదు. సంజూ శాంసన్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లోనే క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆర్చర్ వేసిన షార్ట్ పిచ్ బాల్‌ను భారీ షాట్ ఆడే క్రమంలో సంజూ(3) వికెట్ పారేసుకున్నాడు. తరువాత క్రీజులోకి సూర్యకుమార్ యాదవ్ రాగా.. అభిషేక్ శర్మ దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. ఐదు బౌండరీలతో జోరు కనబర్చాడు. కానీ అతన్ని బ్రైడన్ కార్స్ క్యాచ్ పెవిలియన్ చేర్చాడు. దాంతో క్రీజులోకి తిలక్ వర్మ రాగా.. సూర్య భారీ సిక్సర్‌తో జోరు కనబర్చాడు. కానీ మార్క్ వుడ్ బౌలింగ్‌లో అనవసర షాట్‌తో వికెట్ పారేసుకున్నాడు. దాంతో భారత్ పవర్ ప్లేలోనే 3 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది.

### హార్దిక్ పాండ్యా ఒంటరి పోరాటం

సిక్స్, బౌండరీతో క్రీజులో సెట్ అయ్యే ప్రయత్నం చేసిన తిలక్ వర్మ(18)ను ఆదిల్ రషీద్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో భారత్ 68 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. తరువాత వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్యా ఆచితూచి ఆడాడు. ఈ ఇద్దరూ బౌండరీలు బాదకుండా సింగిల్స్ మాత్రమే తీసారు. దాంతో 40 బంతుల వరకు భారత్ బౌండరీ కొట్టలేకపోయింది.

ఈ ఒత్తిడిలో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో వాషింగ్టన్ సుందర్(6) వికెట్ పారేసుకున్నాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో పైకి పంపుతూ ఇచ్చిన అవకాశాన్ని సుందర్ వినియోగించుకోలేకపోయాడు. తరువాత క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్ కూడా భారీ షాట్ ఆడే ప్రయత్నంలో వెనుదిరగ్గా.. హార్దిక్ పాండ్యా ధాటిగా ఆడుతూ జట్టును విజయం దిశగా నడిపే ప్రయత్నం చేశాడు. కానీ అతన్ని ఓవర్టన్ బోల్తా కొట్టించడంతో భారత్ ఓటమి ఖాయమైంది.

# ఐసీసీ అత్యుత్తమ ప్లేయర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా!

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఇప్పటికే ఐసీసీ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ 2024గా ఎంపికైన బుమ్రా.. తాజాగా ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ 2024(సర్ గ్యారీ ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ) అవార్డును కూడా గెలుచుకున్నాడు. భారత్ నుంచి ఈ ఘనతను అందుకున్న ఐదో క్రికెటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా ఈ ఘనతను అందుకున్న తొలి భారత పేసర్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు.

గతేడాది జస్‌ప్రీత్ బుమ్రా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంతో ఐసీసీ అతన్ని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. దాంతో బుమ్రా.. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రాహుల్ ద్రవిడ్, రవిచంద్రన్ అశ్విన్‌ల సరసన నిలిచాడు. ట్రావిస్ హెడ్, హ్యారీ బ్రూక్, జో రూట్‌లను వెనక్కినెట్టి మరి ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డ్‌ను గెలుచుకున్నాడు.

గతేడాది 13 టెస్ట్‌లు ఆడిన బుమ్రా 71 వికెట్లు పడగొట్టాడు. 8 టీ20ల్లో 15 వికెట్లు తీసాడు. అతని అద్భుత ప్రదర్శనతో టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024ను కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో బుమ్రా ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ఎంపికయ్యాడు.

2004 నుంచి ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ ఇస్తుండగా.. ఆ ఏడాది రాహుల్ ద్రవిడ్ ఈ ఘనతను అందుకున్నాడు. 2010లో సచిన్ టెండూల్కర్, 2016లో రవిచంద్రన్ అశ్విన్, 2017, 2018లో విరాట్ కోహ్లీ, 2024లో జస్‌ప్రీత్ బుమ్రాలు ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నారు.

### ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ విన్నర్స్:

- *రాహుల్ ద్రవిడ్(భారత్)-2004*
- *జాక్వస్ కల్లీస్(సౌతాఫ్రికా), ఆండ్రూ ఫ్లింటాఫ్(ఇంగ్లండ్)-2005*
- *రికీ పాంటింగ్(ఆస్ట్రేలియా)-2006*
- *రికీ పాంటింగ్(ఆస్ట్రేలియా)-2007*
- *శివ్‌నారయణ్ చంద్రపాల్(వెస్టిండీస్)-2008*
- *మిచెల్ జాన్సన్(ఆస్ట్రేలియా)-2009*
- *సచిన్ టెండూల్కర్(భారత్)-2010*
- *జోనాథన్ ట్రోట్(ఇంగ్లండ్)-2011*
- *కుమార సంగక్కర(శ్రీలంక)-2012*
- *మిచెల్ క్లార్క్(ఆస్ట్రేలియా)-2013*
- *మిచెల్ జాన్సన్(ఆస్ట్రేలియా)-2014*
- *స్టీవ్ స్మిత్(ఆస్ట్రేలియా)-2015*
- *రవిచంద్రన్ అశ్విన్(భారత్)-2016*
- *విరాట్ కోహ్లీ(భారత్)-2017*
- *విరాట్ కోహ్లీ(భారత్)-2018*
- *బెన్ స్టోక్స్(ఇంగ్లండ్)-2019*
- *షాహీన్ షా అఫ్రిది(పాకిస్థాన్)-2021*
- *బాబర్ ఆజామ్(పాకిస్థాన్)-2022*
- *ప్యాట్ కమిన్స్(ఆస్ట్రేలియా)-2023*
- *జస్‌ప్రీత్ బుమ్రా(భారత్)-2024*






# దేనికైనా టైంరావాలి..



పవన్ కల్యాణ్ హీరోగా 'పంజా' తెరకెక్కించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు కోలీవుడ్ డైరెక్టర్ విష్ణు వర్ధన్. ఆయన తాజా చిత్రం 'ప్రేమిస్తావా' ఈనెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. పవన్ తనయుడు అకీరా నందన్‌తో 'పంజా' సీక్వెల్‌గానీ, వేరే మూవీగానీ తెరకెక్కిస్తారా? అని విలేకరి అడగ్గా.. 'నేనేదీ ప్లాన్ చేయను. దేనికైనా సమయం రావాలి' అన్నారు. 'పంజా' కూడా ప్లాన్ చేసి తీసింది కాదని గుర్తుచేసుకున్నారు. అవకాశం వస్తే తప్పకుండా అకీరాతో సినిమా చేస్తానని తెలిపారు. 'పంజా' తర్వాత తెలుగులో మళ్లీ సినిమా చేయకపోవడం గురించి మాట్లాడుతూ... "ఓ దర్శకుడిగా క్రియేటివ్‌గా ఆలోచిస్తూ విభిన్న కథలు తెరకెక్కించాలనుకుంటా. సినిమాల ఫలితాన్ని పట్టించుకోను. 'బిల్లా' (అజిత్) తెరకెక్కించిన నేను దాని రీమేక్‌కూ దర్శకత్వం వహించొచ్చు. కానీ, నాకు కంఫర్ట్ జోన్ ఇష్టం ఉండదు. కొత్త జానర్లో ప్రయత్నించిన 'షేర్షా'కు జాతీయ అవార్డు దక్కింది. 'పంజా' తర్వాత తెలుగులో ప్రపోజల్స్ వచ్చిన సమయంలో వేరే ప్రాజెక్టులతో బిజీగా ఉన్నా. కొవిడ్, బాలీవుడ్ సినిమా చేయడం తదితర కారణాల వల్ల ఇక్కడ సినిమాలు చేయలేకపోయా. ఒకవేళ నేను మరో తెలుగు సినిమా చేయకపోతే మా అమ్మ ఊరుకోదు" అని వ్యాఖ్యానించారు. ఆకాశ్ మురళి, అదితి శంకర్ ప్రధాన పాత్రల్లో విష్ణు తెరకెక్కించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ప్రేమిస్తావా'. ఈ జానర్లో సినిమా చేయడం విష్ణుకి తొలిసారి. 'నెసిప్పాయా' టైటిల్తో తమిళంలో ఇటీవల విడుదలైన ఈ సినిమా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది.


## ప్రభాస్ కోసమే..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న చిత్రాల్లో దర్శకుడు హను రాఘవపూడి డైరెక్షన్‌లో ఓ పీరియాడిక్ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ కూడా ఉంది. ఈ సినిమాకు 'ఫౌజీ' అనే టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేసినట్లుగా తెలుస్తోంది. ఇక ఈ సినిమా నుంచి ఎప్పుడెప్పుడు ఏ వార్త వస్తుందా? అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. కాగా, ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో నటిస్తాడని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ సినిమా కథను దర్శకుడు హను రాఘవపూడి తొలుత వేరొక హీరోకి చెప్పాడని.. తర్వాతే ప్రభాస్‌తో సినిమా స్టార్ట్ చేశాడనే టాక్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దర్శకుడు హను ఈ సినిమా కథను ముందుగా న్యాచురల్ స్టార్ నానికి వినిపించాడని వార్తలు వినిపించాయి. అయితే, తాజాగా హను రాఘవపూడి ఈ వార్తలపై క్లారిటీ ఇచ్చారు. తాను ఈ చిత్రాన్ని ప్రభాస్‌ను దృష్టిలో పెట్టుకునే రాశానని.. ఈ మూవీ కథ షూటింగ్ జరుగుతున్న కొద్దీ డెవలప్ అవుతోందని ఆయన చెప్పుకొచ్చారు. దీంతో 'ఫౌజీ' కథపై వస్తున్న పుకార్లకు డైరెక్టర్ ఫుల్‌స్టాప్ పెట్టాడని చెప్పాలి. ఇక ఈ సినిమాలో ఇమాన్వి హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఈ సినిమాకు విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

## స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో జైదీప్



ప్రేక్షకులను విశేషంగా అలరించిన భారతీయ వెబ్‌సిరీసుల్లో 'ఫ్యామిలీమ్యాన్' ఒకటి. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ ముచ్చటగా మూడోసారి అలరించడానికి సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్ కీలక పాత్ర పోషించగా.. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో 'ఫ్యామిలీమ్యాన్: సీజన్3' షూటింగ్ పూర్తయింది. 'పాతాళ్‌లోక్ సిరీస్‌లో తనదైన నటనతో అలరించిన జైదీప్ అహ్లావత్.. ఇప్పుడు 'ఫ్యామిలీమ్యాన్ 3'లో భాగమయ్యారట. తాజాగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌తో మాట్లాడుతూ.. 'ఫ్యామిలీమ్యాన్3'లో నటిస్తున్న మాట నిజమేనన్నారు. తన పాత్ర ఏంటనేది మాత్రం బయటపెట్టలేదు. ఇందులో ప్రతినాయకుడిగా నటిస్తున్నట్లు సమాచారం. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైలెన్స్ సెల్‌లో ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌గా పనిచేసే శ్రీకాంత్ తివారీ ఆయన టీమ్.. రాబోయే 'ఫ్యామిలీమ్యాన్ -3'లో చైనానుంచి వచ్చే ముప్పును తప్పించడానికి ప్రయత్నం చేయనున్నారు. కొవిడ్-19, ఈశాన్య రాష్ట్రాలపై చైనా అటాక్స్ తదితర అంశాలను ఇందులో చూపించనున్నారు.



## ఆ నిర్మాత.. అలా అడిగాడు

అగ్ర నటుడు ఆమిర్‌ఖాన్ 'దంగల్' సినిమాతో కెరీర్ ఆరంభించారు ఫాతిమా సనా షేక్. తెలుగులో 'నువ్వు నేను ఒక్కటవుదాం' అనే చిత్రంలోనూ నటించి మెప్పించారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కెరీర్ ప్రారంభంలోనే క్యాస్టింగ్ కౌచ్ ఎదుర్కొన్నట్లు చెప్పారు. "బాలీవుడ్లో అడుగుపెట్టడానికి ముందు సౌత్ ఇండస్ట్రీలో ఓ అవకాశం వచ్చింది. అది నా కెరీర్‌ను మలుపు తిప్పుతుందని భావించా. హైదరాబాద్లో ఆ చిత్ర నిర్మాతను కలిసినప్పుడు ఆయన నాతో అనుచితంగా ప్రవర్తించారు. 'మీకు అవకాశం కావాలంటే ప్రతి పనిని చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఏది చేయడానికైనా అంగీకరించాలి' అన్నారు. సినిమాకు ఏం అవసరమైనా నేను చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాను. ఆ నిర్మాత క్యాస్టింగ్ కౌచ్ గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడారు. దీంతో ఇబ్బందిపడి మౌనంగా వచ్చేశాను" అని తెలిపారు. ఇండస్ట్రీలో కొత్తవారికి అవకాశం రావడం చాలా కష్టమని ఫాతిమా సనా షేక్ అన్నారు. ఒకవేళ ఎంతో కష్టపడి అవకాశం అందుకున్నా రిఫరెన్స్ పేరుతో నిర్మాతలే 15శాతం పారితోషికాన్ని తీసుకుంటారని చెప్పారు. గతంలోనూ ఫాతిమా లైంగిక వేధింపుల గురించి మాట్లాడారు. లైగింక వేధింపుల కారణంగా ఎన్నో అవకాశాలు కోల్పోయినట్టు చెప్పారు.



## స్పీడ్ డ్యాన్స్ ఆపండబ్బా..!

బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్.. దక్షిణాది కథానాయకులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దుబాయ్ వేదికగా జరిగిన 'గ్లోబల్ విలేజ్ కార్యక్రమంలో వేదికపై డ్యాన్స్ చేసి అతిథులను అలరించారు. అనంతరం మాట్లాడుతూ సౌతిండియా స్టార్స్ ప్రభాస్, మహేష్‌బాబు, రామ్‌చరణ్, అల్లు అర్జున్, యశ్, రజనీకాంత్, విజయ్ తదితరులు తన స్నేహితులని పేర్కొన్నారు. వేగంగా డ్యాన్స్ చేయడం ఆపేయాలని వారికి విజ్ఞప్తి చేశారు. డ్యాన్స్ విషయంలో వారిని ఫాలో అవడం కష్టమంటూ నవ్వులు పూయించారు. ఆయా హీరోల పేర్లను షారుక్ ప్రస్తావిస్తుండగా.. అభిమానుల కేరింతలతో ప్రాంగణం హోరెత్తింది. గతంలోనూ దక్షిణాది చిత్ర పరిశ్రమపై షారుక్ అభిమానాన్ని చాటుకున్నారు. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ, నటులు నయనతార, విజయ్ సేతుపతితో ఆయన కలిసి పనిచేసిన సంగతి తెలిసిందే. ఈ కాంబినేషన్లో తెరకెక్కిన 'జవాన్' రూ.1000 కోట్లు వసూళ్లు చేసిన చిత్రాల జాబితాలో చేరింది. ప్రస్తుతం 'కింగ్' చిత్రంలో నటిస్తున్నారు షారుక్. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో షారుక్ తనయ సుహానాఖాన్ కీలక పాత్ర పోషిస్తోంది.



టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి, త్రిష లీడ్‌రోల్స్‌లో దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తున్న భారీ విజువల్ ట్రీట్ "విశ్వంభర". చిరంజీవి, పాటల రచయిత చంద్రబోస్‌తో కలిపి పిక్‌ని షేర్ చేస్తూ.. విశ్వంభర కోసం కీరవాణి ఏంప్రిపేర్ చేసారో వినిపించేందుకు చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నానంటూ దర్శకుడు వశిష్ట పేర్కొన్నాడు. దీంతో విశ్వంభర ఆల్బమ్‌పై బజ్ క్రియేటైంది. సినిమా రిలీజ్ ఎప్పుడు? అంటూ ఫ్యాన్స్ ఎదురు చూడ్డం మొదలైంది. యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.